ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 14 జూన్ 2025



సన్నబియ్యం సంబరం

జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం అన్నం

- పాఠశాలలు మొదలైన రోజు నుంచే ప్రారంభం
- కడుపునిండా తింటున్న పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులు
- ఇంటి భోజనంలా ఉందని ప్రభుత్వానికి కృతజ్ఞతలు



నందిగామ/మచిలీపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు సన్నబియ్యం అన్నం పెట్టడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వరకు సాధారణ రకం బియ్యాన్ని సరఫరా చేయడంతో కొందరు విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి దూరంగా ఉన్నారు. అది తినడం వల్ల అజీర్తి సమస్యలతో బాధపడ్డారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన మంత్రి నారా లోకేశ్ మిగతా 6లో..



విజయవాడలోని ఓ స్కూల్‌లో..

అందరూ తింటున్నాం..



నేను పదో తరగతి చదువుతున్నాను. పాఠశాలలో సన్నబియ్యంతో వండిన భోజనం పెడుతుండటంతో అందరూ పాఠశాలలోనే అన్నం తింటున్నారు. ఇంటి వద్ద తినే భోజనం మాదిరిగానే ఉంటోంది.

- దేవా అఖిల్, 10వ తరగతి, వెంకటాపురం, మోపిదేవి మండలం

కడుపునిండా తింటున్నాం..



నేను మోపిదేవి మండలం వెంకటాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. గతంలో బడిలో పెట్టే మధ్యాహ్న భోజనం సుద్దగా ఉండేది. మాతో పాటు చదువుకునే పిల్లలు కొందరు బడిలో భోజనం తినేవారు కాదు. ప్రస్తుతం సన్నబియ్యంతో అన్నం వండి పెట్టడం బాగుంది. రుచికరంగా కూడా ఉంది. కడుపునిండా తింటున్నాం.

- మేడికొండ సంతోష్‌కుమార్, వెంకటాపురం, మోపిదేవి మండలం

మామూళ్ల మత్తులో పేకాట జోరు

పామర్రు, మచిలీపట్నం నియోజకవర్గాల్లో పేకాట

- రోజుకో ప్రాంతంలో శిబిరాలు, రూ.లక్షల్లో పందేలు
- పోలీసులకు రోజుకు రూ.లక్ష వరకు మామూళ్లు
- మచిలీపట్నానికి చెందిన వ్యక్తి నేతృత్వంలోనే..
- సహకరిస్తున్న పామర్రు పోలీసులు
- గుడివాడ పోలీసులకు దొరక్కుండా ముందస్తు సమాచారం

> అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులే అందుకు దారులు పరుస్తున్నారు. పేకాట శిబిరాలపై దాడులు చేసి పేకాటరాయుళ్లను పట్టుకోవాల్సిన పోలీసులే వారికి సహకరిస్తున్నారు. ముడుపుల మాయలో జోగుతున్న పామర్రు పోలీసులు పేకాట శిబిరాలను ప్రోత్సహిస్తుండగా, అడ్డుకట్ట వేయాలనుకుంటున్న గుడివాడ పోలీసులకు అడుగడుగునా అడ్డుపడుతున్నారు.



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : పేకాట శిబిరాల నిర్వహణలో ఆరితేరిన మచిలీపట్నానికి చెందిన ఓ వ్యక్తి పామర్రు పోలీసులతో మమేకమై జోరు పెంచాడు. గుడివాడ, బంటుమిల్లి నుంచి రొయ్యల వ్యాపారులు, మచిలీపట్నం, గుంటూరు, విజయవాడ నుంచి రాజకీయ నాయకులు, వ్యాపారులు ఈ పేకాట శిబిరాల్లో పాల్గొంటున్నారు. పామర్రుతో పాటు ప్రాకర్ల, మిగతా 6లో..

● థాంక్యూ సీఎం సార్..

అభివందనం



విజయవాడలో తమ ఫోన్‌కు వచ్చిన బ్యాంక్ మెసేజ్‌ను చూపిస్తున్న ఓ తల్లి

రెండు జిల్లాల్లో తల్లికి వందనం సంబరాలు

అర్హులైన వారి ఖాతాల్లో డబ్బు జమ మొదలు

- ఎన్టీఆర్ జిల్లాలో 1,41,990 మంది తల్లులు.. రూ.210 కోట్ల లబ్ధి
- కృష్ణాజిల్లాలో 1,11,458 మంది తల్లులు.. రూ.175 కోట్ల లబ్ధి
- ఉదయం నుంచి తల్లుల ఫోన్లకు క్రెడిట్ మెసేజ్‌లు
- ముగ్గురు, నలుగురు పిల్లలున్న వారికి భారీ ప్రయోజనం

> అమ్మ కళ్లలో ఆనందం కనిపించింది. విద్యార్థులు సంతోషంతో సంబరాలు చేసుకుంటున్నారు. కూటమి సర్కారు కొలువు తీరి ఏడాదైన సందర్భంగా 'తల్లికి వందనం' నిధులను జమ చేశారు. ఆ డబ్బు గురువారం సాయంత్రం నుంచి తల్లుల ఖాతాల్లో పడటం మొదలవడంతో అంతటా తల్లికి వందనం సంబరాలు చేసుకుంటున్నారు. ముగ్గురు, నలుగురు పిల్లలున్న తల్లుల ఖాతాల్లో కూడా రూ.39 వేలు, రూ.52 వేలు జమ అవుతుండటంతో రెండు జిల్లాల్లో ఎక్కడచూసినా ఇదే చర్చ జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం) : తల్లికి వందనం పథకం డబ్బు శుక్రవారం నుంచి జమ అవుతుండటంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 2,13,846 మంది విద్యార్థులు ఈ పథకానికి ఎంపిక కాగా, 1,41,990 మంది తల్లులను లబ్ధిదారులుగా ప్రభుత్వం గుర్తించింది. వీరందరికీ కలిపి రూ.210 కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది. కృష్ణాజిల్లాలో 1,70,963 మంది విద్యార్థులు అర్హత సాధించగా, 1,11,458 మంది తల్లుల ఖాతాల్లో రూ.175 కోట్ల మేర ప్రభుత్వం జమ చేయనుంది.

తల్లుల ఖాతాలకు డబ్బు జమ

లబ్ధిదారుల జాబితాలను విద్యాశాఖ అధికారులు గురువారమే గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వానికి పంపారు. ఈ జాబితాల ఆధారంగా ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే, అందరికీ తల్లికి వందనం నగదు జమ అవుతుంది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి తల్లులు ఖాతాల్లో నగదు మిగతా 6లో..



● చందర్లపాడు మండలం ఏటూరు గ్రామానికి చెందిన జూపల్లి కవితకు నలుగురు పిల్లలు. ఆమె భర్త రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆమె తన పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. పెద్ద కుమారుడు సిద్ధు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతుండగా, కవల పిల్లలైన లక్కీ, రాజులు ఎంపీపీ స్కూల్లో ఐదో తరగతి చదువుతున్నారు. చివరి కుమారుడు తేజ నాల్గో తరగతి చదువుతున్నాడు. ఈ నలుగురు పిల్లలు కూడా తల్లికి వందనం పథకం కింద ఎంపిక కావటంతో ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆర్థిక సాయం ద్వారా తమ పిల్లలను మరింత సమర్థవంతంగా చదివించుకుంటానని కవిత 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని తన భర్త కలలు కనేవాడని, ఆయన మరణంతో పిల్లల భవిష్యత్తును తలచుకుని భయపడుతున్న తరుణంలో తల్లికి వందనం కింద తాను ఎంపికైనందుకు ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



● చందర్లపాడు మండలానికి చెందిన కలితిరిపి వాణికి ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. భర్త వెంకటేశ్ మృతిచెందాడు. పిల్లల్ని చదివించాలన్న పట్టుదలతో వారిని చదివించుకుంటోంది. వారిని చదివించుకోవటం కష్టంగా మారినా వాటన్నింటినీ భరిస్తూ ఆమె తన పిల్లలను చదివిస్తున్నారు. పెద్ద అమ్మాయి రమ్యశ్రీ జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కుమారుడు వెంకటరమణ ఆరు, ధాత్రిశ్రీ నాల్గో తరగతి చదువుతుండగా, బాలాజీ రెండో తరగతి చదువుతున్నారు. ఈ పిల్లలు తల్లికి వందనం పథకానికి ఎంపిక కావడంతో వాణి ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం తన పిల్లల విద్యాభివృద్ధికి సాయం చేయడం అభినందనీయమన్నారు.



కన్నీరుమున్నీరుగా రోదిస్తున్న చంద్రిక

రవిశంకర్ ఎక్కడ?

పిల్లలతో కలిపి పురుగు మందు తాగినట్టు సమాచారం

- పుట్టినరోజే చావు నిర్ణయం.. హోటల్ యజమాని బంధువుకు ఫోన్
- ఇంకా తెలియని ఆచూకీ.. ప్రత్యేక బృందాల గాలింపు
- బెహరాన్ నుంచి వచ్చిన చంద్రిక.. కన్నీరుమున్నీరు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మైలవరంలో ఇద్దరు పిల్లలకు విషమిచ్చి చంపేసి వెళ్లిపోయిన తండ్రి వేములవాడ రవిశంకర్ ఆచూకీ ఇంకా లభించలేదు. ఈ కేసులో దర్యాప్తు చేసే కొద్దీ కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. పిల్లలిద్దరికీ విషమిచ్చి చంపాలని ముందే రవిశంకర్ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఈనెల 8న రవిశంకర్ తన ఇద్దరు పిల్లలు లక్ష్మీ హిరణ్య, మిగతా 6లో..



రవిశంకర్, చంద్రిక (ఫైల్)

కన్నీరుమున్నీరైన చంద్రిక

తన ఇద్దరు పిల్లల మృతి, భర్త అదృశ్యంతో చంద్రిక కన్నీరుమున్నీరైంది. బెహరాన్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం మైలవరం చేరుకున్న ఆమె ప్రభుత్వాసుపత్రిలో పిల్లల మృతదేహాలను చూసి విలవిల్లాడిపోయింది. తమకు చెప్పుకోదగ్గ అప్పులేమీ లేవని, ఎవరు ఎలాంటి వేధింపులు చేయలేదని చెబుతూ రోదించింది. కాగా, పిల్లల మృతదేహాలకు మైలవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేయడం కుదరకపోవడంతో శుక్రవారం సాయంత్రం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నదిలో యోగాసనం



యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం పుష్కర ఘాట్‌లో శుక్రవారం నదిలో తేలియాడుతూ వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. యోగాంధ్ర జిల్లా ప్రధాన శిక్షకుడు పోతన శాస్త్రిని స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అభినందించారు. 8

నీరుపయోగంగా..

వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకం

17 వేల ఎకరాలకు సాగునీరందించే పథకంపై నిర్లక్ష్యం ● సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినా పట్టని అధికారులు

- మరమ్మతులకు మూడుసార్లు అంచనాల రూపకల్పన
- ఫలితంగా నిధుల విడుదలలో జాప్యం
- ఖరీఫ్‌కు సాగు చేపట్టాలా వద్దా అని రైతుల ఆందోళన
- ప్రత్యామ్నాయమైనా చూపాలంటూ వేడుకోలు

> వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాల మరమ్మతులు రైతుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అంచనాల రూపకల్పనలో ఆలస్యమవుతోంది. ఫలితంగా ఇంతవరకు నిధులు విడుదల కాక, మరమ్మతులకు నోచుకోక, సాగు చేపట్టాలా లేదా అనే మీమాంసలో ఆయకట్టు అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లైనా చేయాలని కోరుతున్నారు.

నందిగామ, ఆంధ్రజ్యోతి : నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని 17 వేల ఎకరాలకు నీరందించే వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకాలు వైసీపీ అధికారంలోకి వచ్చే నాటి వరకు సమర్థవంతంగా పనిచేశాయి. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టగా, ఆ తర్వాత కాంగ్రెస్ హయాంలో విస్తరించారు. దాదాపు 130 అడుగుల ఎత్తు వరకూ కృష్ణాజలాలను ఎత్తిపోసి, అక్కడి నుంచి 430 మీటర్ల మేర పైపులైన్ ద్వారా గ్రావెటీపై



మరమ్మతులకు గురైన వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకం

నీటిని సాగర్ కాల్వకు విడుదల చేశారు. 2,300 అశ్వసామర్థ్యం కలిగిన నాలుగు మోటార్లతో ఈ పథకం పూర్తి ఆయకట్టుకు సునాయాసంగా నీరందించింది. గతంలో టీడీపీ హయాంలో జలవనరుల శాఖ మంత్రిగా పనిచేసిన దేవినేని ఉమామహేశ్వరరావు భారీగా నిధులందించి పూర్తిస్థాయి మరమ్మతులు చేయించారు. ఆ తర్వాత అధికారంలోకి మిగతా 6లో..

ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టాలి

వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాల మరమ్మతులు ఆలస్యమవుతున్న ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఈ పథకాల నీటిని భర్తీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి చెర్వుమాదవరం ట్యాంక్ నుంచి ఆ మేర నీటిని విడుదల చేయించాలి. కానీ హక్కుగా రావాల్సిన వాటాలు ఇచ్చేందుకే తెలంగాణ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్న సమయంలో అదనపు నీటి విడుదల సాధ్యమవుతుందా.. అనే అనుమానాలు కూడా ఉన్నాయి.

ప్రత్యేక ఉత్సవాలకు సన్నద్ధం కావాలి

- 26 నుంచి దుర్గగుడిలో ఆషాఢ ఉత్సవాలు
- ఆలయ సిబ్బందితో ఈవో శీనానాయక్ సమావేశం

6

గుడ్లవల్లేరులో భారీ వర్షం

116 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



8

కారును ఢీకొన్న బైక్

- ద్విచక్రవాహనం నడుపుతున్న ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

8

2,780 మంది సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీ

6

ప్రమాదాలను.. పసిగట్టేద్దాం!

» విమాన ప్రయాణికులు సాంకేతిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

» సిబ్బంది జాగ్రత్తలను తు.చ తప్పక పాటించాలి

» ప్రతికూల పరిస్థితులను అంచనా వేయాలి



అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాదం.. ప్రయాణికుల వెన్నులో ఒణుకు పుట్టిస్తోంది. రోడ్డు, రైలు ప్రయాణాల కంటే విమాన ప్రమాదాలు అతి తక్కువగా ఉండటం.. సురక్షితమని భావిస్తున్న వేళ.. ఎయిర్ ఇండియా ప్రమాదం అనేక భయాలను, సందేహాలను లేవనెత్తుతోంది. విమాన ప్రమాదాల్లో సింహభాగం సాంకేతిక సమస్యల కారణంగానే జరుగుతున్నాయి. సాంకేతిక సమస్యలపై విమాన ప్రయాణికులు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం ముందుగా అంచనా వేసిన ఓ ప్రయాణికుడు అప్రమత్తం కావడంతో సురక్షితంగా బయటపడ్డాడు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విమానం టేకాఫ్‌కు సిద్ధమౌతున్న తరుణంలో ప్రయాణికులు లోపల పరిస్థితులను గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతి రోజూ 50 విమానాలు దేశీయంగా ఢిల్లీ, ముంబాయి, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, కడప, తిరుపతికి.. మరో రెండు అంతర్జాతీయ సర్వీసులు షార్జాకు రాకపోకలు సాగిస్తున్నాయి. దేశీయంగా ఎయిర్ ఇండియాతో పాటు ఇండిగో సంస్థ విమానాలను నడుపుతుండగా.. అంతర్జాతీయంగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలను నడుపుతోంది.

ఎయిర్ ఇండియా ఘోర ప్రమాదంతో విమాన ప్రయాణికుల వెన్నులో భయం పుడుతోంది. విమానాలకు ప్రమాదం సంభవిస్తే నష్టం అపారం. ప్రయాణికులు విమాన స్థితిగతులపై అవగాహన కలిగివుండాల్సిన అవసరం ఉంది. విమాన సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారం కొన్ని అంశాల పట్ల ప్రయాణికులు అవగాహన కలిగి ఉండటం అవసరం.

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

విమానంలో సాంకేతిక లోపాలను పైలట్లు మాత్రమే గుర్తించగలరు. ప్రయాణి కులు కూడా ముందుగా పసిగట్టి సమాచారం ఇవ్వటం ద్వారా ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు. సహజంగా విమానం టేకాఫ్ సమయంలో ఇంజిన్ సమతుల్యంగా ధ్వని వస్తుంది. ఒక్కసారిగా ఇంజిన్ శబ్దం తగ్గినా, ధ్వని తగ్గుతూ, పెరుగుతూ కొట్టుకుంటున్నా విమాన సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాలి. టేకాఫ్ సమయంలో విమానం తేలికగా పైకి ఎగురుతుంది. ఇలాంటి సందర్భంలో సీట్లలో ప్రయాణికులు అధిక ఒత్తిడికి గురైనా, కంపించినా, ఒక వైపుకు వంగినా ప్రమాదసంకేతంగా భావించాలి. టేకాఫ్ తర్వాత విమానం సజావుగా కాకుండా ఒడిదుడుకులతో వెళుతున్నా.. తగినంత ఎత్తు ఎగరలేకపోతున్నా, మెటల్ తెగిపోయే శబ్దాలు, ప్రెషర్ శబ్దాలు వచ్చినా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఒక క్రూగా అప్రమత్తంగా ఉంటూ విమాన సిబ్బందితో నిర్ధారణ చేసుకోవటం సేఫ్టీ ప్రయాణానికి తొలి మెట్టు అని భావించాలి.

టేకాఫ్ సమయంలోనే ప్రమాదాలు..

టేకాఫ్ సందర్భాల్లోనే నూటికి 90 శాతం పైగా విమాన ప్రమాదాలు జరుగుతున్నాయన్నది నిపుణుల మాటగా ఉంది. టేకాఫ్ సమయంలో వాతావరణ పరిస్థితులు, వ్యవస్థల వైఫల్యం, పైలట్, సాంకేతిక లోపాలు, ఎయిర్ డైన మిక్స్ తప్పిదాలు వంటివి కారణమౌతాయి. ప్రధానంగా ఎయిర్ స్పీడ్ తగ్గడం ద్వారా విమానాన్ని పైకి లిఫ్ట్‌చేసే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. ఫలితంగా విమానం గురుత్వాకర్షణకు లోనౌతుంది. ఇంజిన్ ఫెయిల్యూర్స్ కావటం చాలా అరుదు. ఒక ఇంజిన్ పనిచేయకపోయినా రెండో ఇంజిన్ మీద నడిపించవచ్చు. ఒక ఇంజిన్ చెడిపోయి రెండో ఇంజిన్‌ను ఆన్ చేసిన తర్వాత అది తన పవర్‌ను కోల్పోతే విమాన వేగం తగ్గి గురుత్వాకర్షణకు లోనౌతుంది. విమానాల టేకాఫ్ సమయంలో గాలి దిశ మారినా, వేగం మారినా విమాన వేగం తగ్గటానికి అవకాశం ఉంటుంది.



చేయకూడని తప్పులివే

\- కొడాలి శేషాద్రిరావు, ఎయిర్ సేఫ్టీ ఆఫీసర్



విమానంలో 240 మంది ప్రయాణికులు, వారి లగేజీతో కలిపి బరువు ఎక్కువగా ఉంటుంది. లగేజీని కన్వయిర్ బెల్టుతో పంపేటపుడు విమానానికి నాలుగు వైపులా సర్థకుండా సులువుగా ఉంటుందని అక్కడికక్కడ పడేస్తారు(ఫైలింగ్ చేయడం) ఇది ప్రమాదాలకు దారి తీస్తుంది. టేకాఫ్ అయిన కొద్ది సమయానికే కూలిపోవడానికి ఇదే కారణం. ఇతర దేశాలకు వెళ్లే విమానంలో ఇంధనం కూడా అధిక మొత్తంలో ఉంటుంది. దీనివల్ల టేకాఫ్ సమయంలో కష్టంగా ఉంటుంది. పైలట్లు వీటన్నింటిని అంచనా వేస్తూ జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. టేకాఫ్ సమయంలో బర్డ్ హిట్(ఇంజిన్‌లోకి పక్షి దూరిపోవడం) జరగవచ్చు. బర్డ్ హిట్ చాలా ప్రమాదకరం. టేకాఫ్ సమయంలో గాలి పక్క నుంచి కాని క్రాస్‌గా కాని వచ్చినా ఎయిర్‌క్రాఫ్ట్ బ్యాలెన్స్ తప్పే ప్రమాదముంది. ఏవియేషన్‌లో మెయింటినెన్స్ చాలా ముఖ్యం. ఇది అధిక ఖర్చుతో కూడుకున్నది. సుమారు 500 గంటలకు ఒకసారి ఎలక్ట్రానిక్ భాగాలు, కొన్ని ముఖ్యమైన పార్ట్స్ మార్చాలి. సర్వీస్ చేయాలంటే మొత్తం ఎయిర్‌క్రాఫ్ట్‌ను చెక్ చేయాలి. విశ్రాంతి లేకుండా వెంటవెంటనే విమానాన్ని నడపడానికి సన్నద్ధం చేయడం వల్ల పైలట్ల ఏకాగ్రత దెబ్బతింటుంది.



వైదిక బృందం, అర్చకులు, అధికారులతో సమావేశంలో ఈవో

ప్రత్యేక ఉత్సవాలకు సన్నద్ధం కావాలి

» 26 నుంచి దుర్గగుడిలో ఆషాఢ ఉత్సవాలు

» ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఆషాఢమాసం సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలకు సన్నద్ధం కావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనానాయక్ అన్నారు. శుక్రవారం మహామండపంలో ఆలయ వైదిక సిబ్బంది, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి జూలై 24 వరకు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ, ఈ నెల 26 నుంచి జూలై 4 వరకు వారాహి నవరాత్రులు (గుప్త నవరాత్రులు), జూలై 8 నుంచి 10 వరకు శాకంబరీ దేవి ఉత్సవాలు జరగనున్నందున అన్ని ఏర్పాట్లు చేయాలని ఈవో సూచించారు. భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురుప్రకాష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, వైదిక కమిటీ సభ్యులు వి.శ్యావాశ్వ మహర్షి, సీహెచ్ ఆంజనేయ ఘనాపాటి, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, ఉప ప్రధానఅర్చకుడు కోట ప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ ఎన్.రమేష్ బాబు, బి.వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మకు నృత్య కళార్చన

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపం ప్రాంగణంలో కళావేదికపై శుక్రవారం శ్రీభరత్ కళ ఆర్ట్స్ అకాడమీ, చెన్నైకు చెందిన కళాబృందం నృత్య కళార్చన నిర్వహించారు. గురువు రోజా రాణి ఆధ్వర్యంలో కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. పలు కీర్తనలకు కళాకారులు లయబద్ధంగా కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం దేవస్థానం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.



హాజరైన సెకండరీ గ్రేడ్ టీచర్లు, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవోలు

2780 మంది సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీ

మచిలీపట్నం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈనెల 10 నుంచి నాలుగు రోజుల పాటు సెకండరీ గ్రేడ్ టీచర్లకు మచిలీపట్నం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు, కృష్ణాజిల్లా డీఈవో పీవీజే రామారావులు కౌన్సెలింగ్ నిర్వహించారు. 10న 200, 11న 903, 12న 803, చివరి రోజైన శుక్రవారం 847 మందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న 54 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న 2297 మంది, మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న 429 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ఈ ప్రక్రియను అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, రీజనల్ డైరెక్టర్ నాగమణి సందర్శించి పరిశీలించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరిన విధంగా వెబ్ ఆప్షన్లు కాకుండా మాన్యుయల్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. స్క్రీన్‌పై ప్రదర్శించిన పాఠశాలలను ఉపాధ్యాయులు కోరుకోవడంతో వెంటనే బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఎన్‌పీసీఐ స్పెషల్ క్యాంప్

భారతీనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు 'తల్లికి వందనం' స్కాలర్ షిప్ మంజూరుకు బ్యాంక్ ఖాతా, పోస్టల్ ఖాతాలకు ఎన్‌పీసీఐ(నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అనుసంధానం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి, సాధికారత అధికారి జి.మహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 9వ, 10వ తరగతితో పాటు ఇంటర్ చదువుతున్న షెడ్యుల్డ్ కులాల విద్యార్థులకు 'తల్లికి వందనం' స్కాలర్‌షిప్ మంజూరుకు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయం, బ్యాంక్, పోస్ట్ ఆఫీస్‌ల్లో సంప్రదించి బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవచ్చన్నారు. విద్యార్థుల కోసం నేడు ఏపీ సంచాలకులు, సాంఘిక శాఖ వారి ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కారులో మృతుడు అన్నెబోయిన నాగరాజు

కారులో శవం కలకలం!

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

జి.కొండూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కందులపాడు క్రాస్‌రోడ్డు సమీపంలో కారులో శవం కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామానికి చెందిన అన్నెబోయిన నాగరాజు (35) సుమారు 14 ఏళ్ల క్రితం శివపార్వతిని వివాహం చేసుకుని జి.కొండూరు వెలగలేరులో పొక్లెయిన్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. పిల్లలతో కలిసి భద్రాచలం వెళ్లి వద్దామని మూడురోజుల క్రితం విజయవాడ సింగ్‌నగర్‌లోని భవానీ ట్రావెల్స్ నుంచి కారును అద్దెకు తీసుకున్నాడు. శుక్రవారం ఉదయం కందులపాడు క్రాస్ రోడ్డు సమీపంలోని ఓ బట్టీ కొట్టు వద్ద పూటుగా మద్యం సేవించి మత్తులో కింద పడిపోయాడు. దీంతో స్థానికులు అతడ్ని లేపి కారు సీటులో కూర్చోబెట్టారు. పూటుగా మద్యం సేవించి డీ హైడ్రేషన్ వల్ల మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజధాని జీవవైవిధ్యంపై క్షేత్రస్థాయి మూల్యాంకన

» రెండోరోజు వర్క్‌షాపులో పాల్గొన్న వివిధ విభాగాల ప్రముఖులు.. పలు అంశాలపై చర్చలు



అమరావతిలో పర్యటిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నిర్మాణంలో 'జీవ వైవిధ్యం, పర్యావరణ అభివృద్ధి' అంశంపై నిపుణుల నేతృత్వంలో జరిగిన రెండోరోజు వర్క్‌షాపు ముగిసింది. శుక్రవారం ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం అనంతవరం హిల్స్, శాకమూరు పార్క్, ఏజీసీ ప్రాంతం, హైకోర్టు, సీడ్ యాక్సెస్ రోడ్, ఏడీసీఎల్, వాటర్‌బాడీ, వెంకటపాలెం నర్సరీ వంటి కీలకమైన పర్యావరణ ప్రాంతాలను సందర్శించింది. ఈ ప్రదేశాలు అమరావతి గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్‌లో అంతర్భాగాలుగా ఉన్నాయి. అనంతరం ఏడీసీఎల్ హార్టికల్చర్ బృందంతో కలిసి వివిధ జాతుల చెట్లు పెరగడానికి అనుకూలమైన స్థలం, డిజైన్ మెరుగుపరిచే విధానంపై కార్యాచరణ రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు లోబడి అమరావతిని ప్రకృతిలో ఎలా అనుసంధానం చేయాలో ఈ బృందాలు వివరించాయి. అనంతరం ఏపీ సీఆర్‌డీఏ భవనంలో జరిగిన సమావేశంలో ఢిల్లీకి చెందిన నీలా హౌస్ కన్‌స్ట్రక్టెడ్ వెట్‌ల్యాండ్ సంస్థ సభ్యులు మొక్కలు, జలసంబంధమైన ప్రణాళికల గురించి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో పర్యావరణాన్ని పునరుద్ధరించే మొక్కల జాతులు గురించి ప్రదర్శించారు. అనంతరం అమరావతి గ్రీన్‌ఎనర్జీ మౌలిక సదుపాయాలు, పార్కులు, అవెన్యూలు, బఫర్ ప్లాంటేషన్, నగర వ్యాప్తంగా నీలి, ఆకుపచ్చ పర్యావరణ నెట్‌వర్క్ అభివృద్ధి గురించి ప్రెజెంటేషన్ చేశారు. ముగింపు సెషన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తమ సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఢిల్లీ విశ్వవిద్యాలయ వర్గీకరణ శాస్త్రవేత్త, మాజీ వైస్ చాన్సలర్ సీఆర్ బాబు, శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ రవిప్రసాద్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి ఎన్.చంద్రమోహన్ రెడ్డి, ఏడీసీఎల్ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ కలెక్టర్ డైరెక్టర్ ధర్మజ, సీనియర్ ప్లానర్ ప్రమాన్‌కుమార్, ఏపీసీఆర్‌డీఏ స్ట్రాటజీ డివిజన్ డైరెక్టర్ ఎన్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పర్వతనేని రవికుమార్

» ప్రస్తుత అధ్యక్షుడు ఆర్వీ స్వామి తొలగింపు

విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ (అప్హా) నూతన అధ్యక్షుడిగా ఐరా హోటల్ అధినేత పర్వతనేని రవికుమార్ ఎన్నికయ్యారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న ఆర్వీ స్వామి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పూనుకుంటున్నారనే ఆరోపణలపై శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో 13 జిల్లాల నుంచి వచ్చిన సభ్యులు బహిష్కరించడంతో ఆయన్ను అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగించారు. సంఘంలో ఉండగానే, ఆయన సొంతగా ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయడాన్ని ఖండించారు. వాస్తవానికి ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షుడి హోదాలో ఆర్వీ స్వామి ఏర్పాటు చేశారు. అయితే, సమావేశానికి పిలుపునిచ్చిన కొద్దిరోజులకే ఆయన వేరే సంఘాన్ని పెట్టుకున్నారు. అప్పటికీ ఆయన అప్హాలో కొనసాగుతున్నారు. దీనిపై 13 జిల్లాలకు చెందిన సభ్యులు ఆయన్ను ట్రోల్ చేయడంతో రాజీనామా లేఖను సమర్పించారు. సంఘ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పర్వతనేని రవికుమార్ మాట్లాడుతూ, కొందరి ప్రయోజనాల కోసం కాకుండా అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, స్టార్ హోటళ్ల సమస్యలపై పనిచేస్తామన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే

నూతన అసోసియేషన్ ఏర్పాటు : ఆర్వీ స్వామి

గుణదల : సమస్యల పరిష్కారం కోసమే నూతన అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని.. పదవుల కోసం కాదని ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి తెలిపారు. గుణదలలోని హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ హోటల్స్ అసోసియేషన్‌కు రాజీనామా ఇవ్వడం జరిగిందని చెప్పారు. అయినప్పటికీ స్టార్ హోటల్స్ అసోసియేషన్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. అన్ని సాధారణ సమస్యలపై కలిసి పనిచేస్తామన్నారు.

మామూళ్ల మత్తులో ..

(5వ పేజీ తరువాయి)

పసుమర్రు, నిమ్మకూరు, జుజ్జువరం తదితర ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఏ గ్రామంలో, ఏ సమయంలో శిబిరాలు నిర్వహించాలో పామర్రు పోలీసులే సూచిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పోలీసులు సూచించిన ప్రాంతంలో పేకాట శిబిరాల స్థాయిని బట్టి ఇంత మొత్తం ఇవ్వాలని ముందే బేరం కుదుర్చుకుంటున్నారు. రోజుకు కనీసం రూ.లక్ష చొప్పున ముడుపులు అందుతున్నట్టు పోలీసులే మాట్లాడుకుంటున్నారు. రోజూ తెల్లవారుజామున పేకాట శిబిరాలు నిర్వహించే వారి వద్దకు ఓ కానిస్టేబుల్ వెళ్లి నగదు తీసుకుంటున్నాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పామర్రు పోలీసులు, పేకాట శిబిరాల నిర్వాహకులు స్పెషల్ బ్రాంచ్ పోలీసులను సైతం చెప్పుచేతల్లో పెట్టుకుని తమదైనశైలిలో శిబిరాలను నడుపుతుండటం గమనార్హం.

గుడివాడ పోలీసులు నిఘా పెట్టినా..

పామర్రు పోలీసుల కనుసన్నల్లో పేకాట శిబిరాలు జోరుగా సాగుతుండటం, ఈ విషయం అల్లరిపాలు అవుతుండటంతో పాటు జిల్లాస్థాయి అధికారుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో గుడివాడ డివిజన్ పోలీసులు పేకాట శిబిరాలపై దాడులు చేసేందుకు ప్రయత్నించారు. వీరు దాడులకు బయల్దేరిన ప్రతిసారీ ముందే పామర్రు పోలీసులకు సమాచారం అందడంతో పేకాట శిబిరాలు నిర్వహించే వారిని అప్రమత్తం చేస్తున్నారు. గుడివాడలో నిఘా విభాగంలో పనిచేసే ఓ కానిస్టేబుల్ పామర్రు పోలీసులతో కుమ్మక్కై ముందే సమాచారం చేరవేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. పామర్రులో ఓ వ్యాపారి పర్యవేక్షణలో రాత్రి సమయంలో జోరుగా పేకాట నిర్వహిస్తున్నారు. కోసూరు, కాజ, పెదసనగల్లు గ్రామాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. పెదసనగల్లులో బ్రదర్స్‌గా పేరొందిన వారి ఆధ్వర్యంలో పేకాట శిబిరం నిర్వహిస్తూ రోజువారీ రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు పోలీసులకు ముడుపులు ముట్టజెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కోనలో కోలాహలంగా..

ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు మంగినపూడి బీచ్‌లో మసులా బీచ్ ఫెస్టివల్ జరిగింది. పోలీసులు, అధికారులు ఈ విధుల్లో ఉండిపోయారు. దీనిని సాకుగా చేసుకుని మచిలీపట్నానికి చెందిన పేకాట నిర్వాహకుడు కోన గ్రామంలో జోరుగా పేకాట శిబిరం నిర్వహించారని స్థానికులు చెప్పుకొంటున్నారు. ఈ విషయంలో పెద్దమొత్తంలో నగదు చేతులు మారిందనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో పేకాట శిబిరాలు నిర్వహించిన పెడన నియోజకవర్గంలోని వైసీపీకి చెందిన నాయకులకు బార్లపూడిలో పేకాట శిబిరం నిర్వహించేందుకు పోలీసులు అనుమతులు ఇవ్వడంతో ఈ అంశం వివాదాస్పదమైంది. గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మూడు రోజుల్లోనే శిబిరాన్ని నిలిపివేశారు.

అభివందనం

(5వ పేజీ తరువాయి)

జమ అవుతూ వస్తోంది. డబ్బు క్రెడిట్ అయినట్టుగా కొందరికి మెసేజ్‌లు కూడా వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులు, వారి తల్లుల ఆధార్‌కార్డు నెంబర్లు బ్యాంకు ఖాతాల నెంబర్లకు అనుసంధానం కాకపోవడం, కొందరి పేర్లు ఎక్కువసార్లు నమోదు కావడం వంటి సమస్యలు తలెత్తాయి. ఇలాంటి వారికి డబ్బు జమ కాలేదు. వీటిని సరిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వాటిని సరిచేసే పనిలో ఎంఈవోలు, సచివాలయ సిబ్బంది బిజీగా ఉన్నారు. అర్హులైన తల్లులు కొందరు తమకు మెసేజ్‌లు రాకపోవటంతో ఆందోళన చెందారు. అయితే, అర్హులైన వారందరికీ నగదు జమ అవుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎంఈవోలు స్పష్టం చేస్తున్నారు.

ముగ్గురు, నలుగురు పిల్లలున్న వారికి లబ్ధి

ముగ్గురు, నలుగురు పిల్లలున్న కుటుంబాలకు భారీగా లబ్ధి కలిగింది. ముగ్గురు పిల్లలున్న కుటుంబాలకు రూ.39 వేలు, నలుగురుంటే రూ.52 వేలు జమ అయ్యాయి. చందర్లపాడు మండలంలోని ఏటూరు, వెలదికొత్తపాలెం గ్రామాల్లో నలుగురు చొప్పున పిల్లలను చదివిస్తున్న తల్లులకు రూ.52 వేల వరకు జమ అయ్యింది. పేదరికంలో ఉన్నా.. పిల్లలను చదివించాలన్న ఆకాంక్ష ఉన్న తల్లులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

వైసీపీ కార్యకర్త ఆనందం

తల్లికి వందనం జమతో వాట్సాప్ స్టేటస్

మైలవరం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగంగా తల్లికి వందనం డబ్బు జమ కావడంతో ఓ వైసీపీ కార్యకర్త ఆనందం వ్యక్తం చేశాడు. మండలంలోని పొందుగల గ్రామానికి చెందిన పుల్లూరు రమేశ్ తన పిల్లల డబ్బు జమ కావడంతో ఆనందంతో ఫోన్‌లో వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నాడు.

రవిశంకర్ ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

లీలసాయికి పురుగు మందు ఇచ్చినట్టు సమాచారం. అదేరోజు రవిశంకర్ పనిచేస్తున్న హోటల్ యజమాని సురేష్ బంధువుకు ఫోన్ చేశాడు. అప్పుల బాధలు ఎక్కువగా ఉన్నాయని చెప్పాడు. వారికిచ్చిన హామీని నెరవేర్చలేకపోతున్నానని ఆవేదన చెందాడు. తాను, పిల్లలిద్దరూ పురుగుల మందు తాగామని చెప్పాడు. నాలుగైదు నిమిషాలు మాట్లాడాక రవిశంకర్ కాల్ కట్ అయ్యింది. ఆ తర్వాత అవతలి వ్యక్తి తిరిగి ఫోన్ చేసినప్పటికీ స్విచ్చాఫ్ అని వచ్చింది. ఫోన్‌లో చార్జింగ్ అయిపోయిందని అవతల వ్యక్తి భావించాడు.

అమ్మ పిలిస్తే అనారోగ్యం అన్నాడు

ఈనెల 8న రవిశంకర్ పుట్టినరోజు. దీనికి నాలుగైదు రోజుల ముందు నుంచి అతడు హోటల్లో పనికి వెళ్లడం మానేశాడు. వంట మాస్టర్‌గా పనిచేస్తున్న అతడు కొంతకాలంగా నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. రెండేళ్ల కిందట రవిశంకర్‌కు కాళ్లలో నరాలు వాచిపోయాయి. ఆపరేషన్ చేయించాక ఎక్కువసేపు నిలబడలేకపోయేవాడు. అప్పటికే భార్య చంద్రిక దుబాయిలో పనిచేస్తోంది. ఆపరేషన్‌కు అయిన రూ.2 లక్షలను ఆమె సర్దుబాటు చేసింది. ఆ తర్వాత నరాల నుంచి రక్తస్రావం మొదలైంది. విజయవాడలో చూపించగా, మళ్లీ ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. ఈసారి ఆపరేషన్ చేస్తే నిలబడటం కష్టంగా ఉంటుందని చెప్పారు. దీంతో రవిశంకర్ వెనక్కి తగ్గాడు. భీమవరంలో భార్య చంద్రికకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని విక్రయించి అప్పులు తీరుస్తానని చెప్పి అక్కడికి వెళ్లాడు. అప్పటికే పిల్లలిద్దరూ భీమవరంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్నారు. రవిశంకర్ ఇంటికి రాకపోవడంతో తండ్రి లక్ష్మీపతి అతడికి ఫోన్ చేసేవాడు. తాను భీమవరంలో ఉన్నానని, స్థలం అమ్మేసి డబ్బు తీసుకొచ్చి అప్పులు తీరుస్తానని చెప్పాడు. ఈ నెల 6న భీమవరం నుంచి పిల్లలతో సహా మైలవరం వచ్చేశాడు. 8న రవిశంకర్ పుట్టిన రోజు కావడంతో తల్లి ఫోన్ చేసి ఇంటికి రమ్మని చెప్పింది. పిల్లలకు ఆరోగ్యం బాలేదని చెప్పి వెళ్లలేదు. ఆ రోజే పిల్లలను చంపి తాను చనిపోవాలనుకున్నట్టు పోలీసులు చెబుతున్నారు. పిల్లలిద్దరూ ఇంట్లోనే చనిపోవడంతో వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. రవిశంకర్ జీవించి ఉన్నాడా, లేదా అనే విషయం ఇప్పటివరకు తెలియలేదు.

ఇబ్రహీంపట్నంలో చివరి లొకేషన్

రవిశంకర్ ఆచూకీ కోసం మైలవరం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. సాంకేతికంగా విచారణ సాగిస్తున్నారు. ఇంట్లో పిల్లలకు విషం ఇచ్చాక అతడు ఇంటి ముందు ఆటో ఎక్కి ఇబ్రహీంపట్నం చేరుకున్నట్టు భావిస్తున్నారు. రవిశంకర్ సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేయగా, చివరి లొకేషన్ ఇబ్రహీంపట్నం చూపించింది. మైలవరం నుంచి విజయవాడకు అనుసంధానంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా, ఎక్కడా రవిశంకర్ కనిపించలేదు. ఆటోలో వెళ్లిపోవడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. పోలీసులు ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించగా, ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. పిల్లలకు విషం ఇచ్చాక భయంతో ఇబ్రహీంపట్నం వచ్చి నదిలో దూకి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

నీరుపయోగంగా..

(5వ పేజీ తరువాయి)

వచ్చిన వైసీపీ పాలకులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఐదేళ్లగా ఈ పథకం మూలకు చేరింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నదాతల ఆశలు చిగురించాయి. మరమ్మతులు చేయిస్తారన్న వారి కలలు ఇంతవరకు నెరవేరలేదు. ఏడాదిగా నిధుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. అవి అందకపోవడంతో సాగు చేపట్టాలా, లేదా అని యోచిస్తున్నారు.

భరోసా ఇస్తారా?

గత ఏడాది ఖరీఫ్ నాటికి కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. దీంతో కచ్చితంగా మరమ్మతులు చేస్తారన్న నమ్మకంతో ఆయకట్టులో అన్నదాతలు సాగు చేపట్టారు. వాణిజ్య, ఆహార పంటలు చేపట్టారు. కానీ, ఈ పథకం మరమ్మతులకు నిధులు అందలేదు. దీంతో నీటి కోసం అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు తెలంగాణాలోని సీఎం ట్యాంక్ నుంచి దిగువకు రావాల్సిన సాగర్ నీరు కూడా పూర్తిస్థాయిలో అందలేదు. ఫలితంగా పంటలు ఎండిపోయాయి. మిర్చి, మొక్కజొన్న, మాగాణి పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. ఆ చేదు అనుభవాల నడుమ తిరిగి ఖరీఫ్ ప్రారంభమైంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి ఆదేశించినా పనులు ముందుకు సాగకపోవడంపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు తగ్గే నాటికి మోటార్లు బిగించి నీటిని విడుదల చేసినా సాగుకు సరిపోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరగా నిధులు కేటాయించి మరమ్మతులు ప్రారంభిస్తుందని స్థానిక రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి శాసనసభ సమావేశంలోనే నందిగామ ఎమ్మెల్యే సౌమ్య.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ సమస్యను వివరించారు. మరమ్మతులకు నిధులు అందించాలని కోరగా, సంబంధిత మంత్రిని కలవాలని ఆయన సూచించారు. ఆ తర్వాత జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌తో కలిసి సౌమ్య.. మంత్రి నిమ్మల రామానాయుడికి వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ 5న ముప్పాళ్ల వచ్చిన చంద్రబాబుకు కూడా వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తక్షణమే నిధులు విడుదల చేసి ఖరీఫ్‌కు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే, అంచనాలు రూపొందించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. స్థానిక అధికారులు రూపొందించిన అంచనాలపై ఉన్నతాధికారులు రిమార్కులు పెట్టడం, వాటిని సరిచేసి స్థానిక అధికారులు తిరిగి పంపడం జరుగుతోంది. ఇప్పటికే మూడుసార్లు ఇలా జరిగింది. ఈసారైనా అధికారులు, పాలకులు దృష్టిసారించి ఖరీఫ్‌కు పథకాలను సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు.

సన్నబియ్యం సంబరం

(5వ పేజీ తరువాయి)

మధ్యాహ్న భోజనంపై దృష్టి సారించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సూపర్ ఫైన్ క్వాలిటీ బియ్యంతో మధ్యాహ్న భోజనం, హాస్టల్ విద్యార్థులకు ఆహారం అందించాలని నిర్ణయించారు. మెనూలో కూడా మార్పులు చేసిన ఆయన అన్ని పాఠశాలలకూ సన్నబియ్యం సరఫరా చేయించారు. పాఠశాలలు ప్రారంభించిన మొదటి రోజే ఈ బియ్యం అందుబాటులోకి వచ్చేశాయి. నందిగామ మండలం లింగాలపాడు జిల్లా పరిషత్ పాఠశాల సిబ్బంది నాణ్యమైన బియ్యంతో విద్యార్థులకు బిర్యానీ వండి పెట్టారు. లింగాలపాడులో సన్న బియ్యంతో అన్నం తిన్న పలువురు విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	108, 116, 127
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ బాగా చదువుకుని ఉన్నతస్థితికి చేరాలని ఉంగుటూరు జడ్పీహైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ పులి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాంను పాఠశాల హెచ్ఎం చోరగుడి అనితతో కలిసి పంపిణీ చేశారు.





సర్పంచ్ గండికోట సీతయ్యకు సమస్యలు వివరిస్తున్న ఒకటవ వార్డు మహిళలు

రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలి

విజయవాడ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం అంబాపురం పంచాయతీ పరిధిలోని ఒకటవ వార్డులో రహదారులు, తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. శుక్రవారం సర్పంచ్ గండికోట సీతయ్య కార్యాలయం వద్దకు చేరుకున్న పలువురు మహిళలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. చాలా కాలంగా తాగునీరు లేక బోర్ నీళ్లపై ఆధార పడుతున్నామని, వర్షాలు వస్తే రోడ్లు బురదమయంగా తయారౌతున్నాయని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల సమస్యలపై స్పందించిన సీతయ్య మాట్లాడుతూ, సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన

ఉయ్యూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో మండల పరిషత్ ఆధ్వర్యాన సచివాలయంలో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో ఇస్తున్న శిక్షణ, సదుపాయాలు మహిళలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.

వీలునామా రిజిస్ట్రేషన్ రద్దు

ఉయ్యూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గండిగుంటలో సుమారు 10 సెంట్ల గ్రామ కంఠం పంచాయతీ భూమిని తన తల్లినుంచి వీలు నామా ద్వారా ముక్కామల శాయోజీరావు చేయించుకున్న రిజిస్ట్రేషన్ రద్దు చేసుకున్నట్టు ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. పంచాయతీ ఆస్తిని ఆక్రమించుకుని రిజిస్ట్రేన్ చేయించుకోవడానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శి నోటీసు ఇవ్వగా రిజిస్ట్రేన్ రద్దుచేసుకుంటున్నట్టు శాయోజీరావు లిఖితపూర్వకంగా కార్యదర్శికి తెలియజేశారు. ఆ మేర రిజిస్ట్రేషన్ రద్దు చేసుకున్నట్టు కార్యదర్శి తెలిపారు.



కొయ్యగూరపాడులో విజయోత్సవంలో కేకు కట్ చేస్తున్న కూటమి నేతలు

కూటమి శ్రేణుల విజయోత్సవం

ఉంగుటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవ సంబరాలను మండల వ్యాప్తంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. కొయ్యగూరపాడులో గురువారం రాత్రి కూటమి నేతలు నిర్వహించిన విజయోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. తొలుత టీడీపీ వ్యవస్థాపకులు, మాజీముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యకర్తలు, అభిమానుల కోలాహలం మధ్య కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు ఆరికట్ల రవికుమార్, గులిపల్లి సందీప్, రాజబోయిన శివాజీ, నక్కా వీరవెంకటేశ్వరరావు, తోట సాంబశివరావు, కోలవెంటి నాగబాబు, పోతినేని రామకృష్ణ, గోగినేని విష్ణువర్ధనరావు, కె.జైపాల్, మున్నా రామకృష్ణ, నిమ్మకూరి మహేష్, కాపుదాసి సునీల్, తోట గోపి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి అభివందనం

కంకిపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం ద్వారా తల్లులకు రూ. 8.745 వేల కోట్లు విడుదల చేయడం హర్షణీయమని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా తల్లికి వందనం పథకం ద్వారా సుమారు 67 లక్షల మందికి తల్లికి వందనం కింద రూ. 8745 కోట్లు కూటమి ప్రభుత్వం ఏకకాలంలో విడుదల చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 40 లక్షల మందికి రూ. 5540 కోట్లు విడుదల చేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల గడప!

- కొత్త కమిషనర్ రాకతో తాడిగడపలో అభివృద్ధి పనులు గాడిలో పడేనా?
- గత కమిషనర్ తీరుతో పేరుకుపోయిన సమస్యలు
- అన్ని శాఖల సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

(పెనమలూరు - ఆంధ్రజ్యోతి)

తాడిగడప మునిసిపాలిటీకి నూతనంగా నియమితులయిన కమిషనర్‌కు పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. నూతనంగా ఏర్పాటు చేసిన మునిసిపాలిటీ కావడం, మునిసిపాలిటీగా అవతరించిన తర్వాత పాలకులు, అధికారులు మౌలిక సదుపాయాల ఏర్పాటులో విఫలం కావడం తదితర కారణాలతో మునిసిపాలిటీలో అభివృద్ధి కుంటుపడింది. అసమగ్ర విధానాలతో మునిసిపాలిటీగా ఏర్పాటు చేసి పాలకులు పన్నుల రూపంలో ప్రజలను దోచుకున్నారే తప్ప కనీస వసతులయిన రోడ్లు డ్రైన్లు ఏర్పాటు చేయలేకపోయారు. చిన్నపాటి వర్షాలకే కానూరు ప్రధాన రోడ్డు, సనత్‌నగర్, కానూరులోని లోతట్టు ప్రాంతాలు మునిగి స్థానికులకు చుక్కలు చూపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో కానూరు ప్రధాన రహదారిలో వర్షాలకు మోకాలు లోతు గుంతల్లో నీళ్లు నిలిచిపోయి ఎంతోమంది ప్రమాదాలకు గురైన సందర్భాలున్నాయి. ఈ విషయంపై అప్పట్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నేతృత్వంలో టీడీపీ శ్రేణులు ఆందోళనలూ చేపట్టాయి. పారిశుధ్యం నిర్వహణలో తాడిగడప మునిసిపాలిటీ ఇతర మునిసిపాలిటీలతో పోల్చి చూస్తే ఎంతో వెనుకబడింది. ఏరోజుకారోజు చెత్తను తీసివేయాల్సిన మునిసిపల్ సిబ్బంది వాహనాల కొరతతో రెండు మూడు రోజులకొకసారి కూడా చెత్తను ఎత్తడం గగనమౌతోంది. బోడె ప్రసాద్ తిరిగి ఎమ్మెల్యే అయిన తర్వాత గత టీడీపీ ప్రభుత్వంలో కొంతవరకు జరిగి పెండింగ్‌లో ఉన్న పనులు...వీఆర్ సిద్ధార్థ వంతెన, యనమలకుదురు వంతెన లాంటివి పూర్తి చేయడం, మునిసిపాలిటీకి అధిక మొత్తంలో నిధులు తెచ్చి శరవేగంగా పనులు చేయించడం జరుగుతోంది. మునిసిపాలిటీలోని అన్ని విభాగాలను సమన్వయం చేసి అధికారులు, సిబ్బందితో అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సిన బాధ్యత పెనుభారంగా మారనుంది. మునిసిపాలిటీలోని కీలక ఇంజనీరింగ్ విభాగంలో నెలకొన్న స్తబ్దతను ఎలా వెలికితీసి పారదోలతారో చూడాల్సి ఉంది. నూతన తాడిగడప మునిసిపాలిటీలో గత కమిషనర్ల వ్యవహారశైలి గురించి అధికారులతో ప్రజలతో చర్చించి ఇక మీదట గతంలో జరిగిన పొరపాట్లు తిరిగి తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత నూతన కమిషనరుపై ఉంది.



తాడిగడప మునిసిపాలిటి కార్యాలయం

గత కమిషనర్ ఒంటెత్తుపోకడతో ప్రజలకు కష్టాలు

ఇంటి పన్నులు విధించడం, సవరించిన పన్నులను వసూలు చేసి ఎవరి మునిసిపాలిటీని వారే అభివృద్ధి చేసుకోవాలని సాక్షాత్తూ మునిసిపల్ మంత్రి నారాయణ కమిషనర్లకు సూచించినా గత కమిషనర్ భవానీ ప్రసాద్ ఒంటెత్తుపోకడలతో ఇంటి పన్నులు విధించడానికి ఆర్ఐల ద్వారా వసూళ్లకు పాల్పడడంతో పన్నులు వేయించుకొనేవారు వెనక్కి తగ్గి మరెప్పుడయినా ఇంటి పన్ను వేయించుకోవచ్చులే అని సరిపెట్టుకున్న ఉదంతాలు మరెన్నో ఉన్నాయి. సమగ్ర ప్రణాళికతో ఇంటి పన్నులు విధించి వసూలు చేయగలిగితే ప్రతి ఏడాది కనీసం పది కోట్లకు తగ్గకుండా రెవెన్యూను రాబట్టి ఆ నిధులను అభివృద్ధి వాడుకోవచ్చు మమ్మల్ని ఇంటి పన్నుల కోసం అర్జీ పెట్టుకున్నవారి వద్ద నుండి మామూళ్లు వసూలు చేసి సాయంత్రానికి ఇవ్వమని వేధింపులకు గురి చేసేవాడని అతను వాపోయాడు.

ఏలూరు కాలువ చానళ్ల అభివృద్ధి పనులు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సకాలంలో సాగునీందించేందుకు ఏర్పాట్లు చేయాలన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలతో ఏలూరు కాలువకు అనుసంధానంగా ఉన్న చానళ్ల అభివృద్ధి పనులు మొదలుపెట్టడం జరిగిందని డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ తెలిపారు. వీరవల్లి వద్ద ఏలూరు కాలువకు అనుసంధానంగా ఉన్న 5 సాగునీటి కాలువలకు నూతన తూములు, షట్టర్లు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని శుక్రవారం తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఏలూరు కాలువకు అనుసంధానంగా ఉన్న 5 స్లూయిజ్‌లు, డ్రాపులైన శ్రీరాములయ్య స్యూయిజ్, భోషాణంకోడు డ్రాపు, కొత్తతూము డ్రాపు, తిప్పనగుంట చానల్ డ్రాపు, వీరవల్లి చానల్-1 మీద గల హెడ్ వాల్వు పనులను రూ. 40లక్షల నిధులతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా పనులు మొదలుపెట్టినట్లు వివరించారు. ఏలూరుకాలువకు నీటి విడుదల చేసే సమయానికి పనులు పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, కలపాల రాజాబాబు, ఉపసర్పంచ్ లంక అజయ్ కుమార్, పిల్లా రామారావు, మండాది రవీంద్ర, మాణికల శివాజీ, కాకాని పాల్గొన్నారు.



ఏలూరు కాలువకు తూములు, షట్టర్ల ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్



రంగన్నగూడెంలో విద్యామిత్ర కిట్లను అందజేసిన ఎస్ఎస్ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, సర్పంచ్ రంగామణి

నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎస్ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ సూచించారు. రంగన్న గూడెం ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను అందజేశారు. రంగన్నగూడెంలో 96 మందికి తల్లికి వంద నం మంజూరైందని సర్పంచ్ కసుకుర్తి రంగామణి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గ్లోరీ స్వర్ణలత, ఎస్ఎంసీ చైర్మన్ నత్తా అబ్రహాం, ఎక్స్ అఫీషియో సభ్యుడు తుమ్మల దశరధరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టీడీపీ నాయకుడు కలపాల రాధాకృష్ణమూర్తి విద్యార్థులకు సూచించారు. రేమల్లె హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం విద్యామిత్రకిట్లతో పాటు అదనంగా నోట్‌బుక్స్‌ను పారిశ్రామిక సలహాదారు దేవినేని నన్నారాంతో కలిసి అందజేశారు. హెచ్ఎం లూథర్‌పాల్, ఎస్ఎంసీ చైర్మన్ సొదిమెళ్ల శ్యామ్ పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉయ్యూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్మిషన్ లైన్ స్ట్రింగ్ పనులు రెండు రోజుల పాటు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉయ్యూరు, గండిగుంట, కాటూరు, ముదునూరు, నందమూరు, యాకమూరు, తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, పెనమకూరు, దేవరపల్లి, వల్లూరుపాలెం, పాములలంక 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో శని, ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఏర్పడ వచ్చని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణ నాయక్ తెలిపారు.

కానూరు : కానూరు విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11కేవీలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి 11 గంటల వరకు కానూరు సెక్షన్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ గుణదల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కానూరు లాస్ట్ బస్సుస్టాప్ ఏరియా, పెదబావి సెంటర్, యాదవుల బజారు, రంగా బొమ్మ సెంటర్ ప్రాంతం, ఒల్డేజ్ హోమ్ రోడ్డు ప్రాంతం, రాజ్‌కమల్ బిల్డింగ్ ఏరియా, కెనడీ స్కూల్ ప్రాంతం, కామయ్యతోపు పార్కు, జేఆర్‌డీ పార్కు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉంగుటూరు : 33/11కేవీ పెదఅవుటపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 11 గంటలవరకు పెదఅవుటపల్లి, శివారు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుడివాడ డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదఅవుటపల్లి, హైటెక్, ఏజీఎల్, ఇండస్ట్రియల్ ఫీడర్ ప్రాంతాల్లో గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్ : విద్యుత్ లైన్ల మరమ్మతు నిర్వహణ కారణంగా జంక్షన్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని బాపులపాడులో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జి ఏఈ మురళీకృష్ణ తెలిపారు. బాపులపాడు -2 ఫీడర్ పరిధిలోని గుడివాడ రోడ్డు, ఇందిరానగర్, హైటెక్ కాలనీ, బీసీ కాలనీ, ఇందిరానగర్ గట్టు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గన్నవరం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ గన్నవరం, మర్లపాలెం, చిన అవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్‌పోర్టు సిటీ, బీబీగూడెం, గోపవరపుగూడెం, చిక్కవరం ప్రాంతాల్లో విద్యుత్‌లైన్ల మరమ్మతులు చేసేందుకు సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు.

అనధికార లేఅవుట్లలో విద్యుత్ లైన్లు తొలగించాలి

ఉయ్యూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్లలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అక్రమంగా వేసిన విద్యుత్ లైన్లు తొలగించాలని రాష్ట్ర లోకాయుక్త, రాష్ట్ర విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శి జి.విజయానంద్‌కు ఫిర్యాదు చేసిన ఫిర్యాదు మేరకు ఆంధ్రప్రదేశ్ థ్రెఫ్ట్ స్క్వాడ్ ఎలక్ట్రికల్ విజిలెన్స్ విజయవాడ విభాగం అధికారులు విచారణ చేపట్టినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. ఆమేర విజిలెన్స్ ప్రతినిధి జి.దాస్ శ్రీనివాసగౌడ్‌ను శుక్రవారం కలసి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనధికార లే అవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, జిల్లాలో కూడా సీఆర్డీఏ, ముడా అనుమతులు లేకుండా వ్యవసాయ భూముల్లో వెంచర్లు వేస్తున్న రియల్టర్లు ప్రభుత్వానికి రావాలసిన రెవెన్యూకి గండికొడుతున్నారన్నారు. అనుమతుల్లేని వెంచర్లలో విద్యుత్ శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వేస్తున్నారని రాష్ట్ర లోకాయుక్తలో చేసిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ విచారణ జరుగుతుందని తెలిపారు.

మలేరియా నివారణకు సహకరించాలి

గన్నవరం జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మలేరియా నివారణే లక్ష్యంగా అందరు పనిచేయాలని జిల్లా మలేరియా నివారణ అధికారి బి రామారావు అన్నారు. మండలంలోని ముస్తాబాదలో శుక్రవారం ఆయన పర్యటించారు. బాలి కల వసతి గృహానికి వెళ్లి రికార్డులు పరిశీలించి, గదులలో మందులను స్ప్రే చేయించారు. గ్రామంలో ర్యాలీని నిర్వహించి మాట్లాడుతూ, మలేరియా నివారణకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



ముస్తాబాద్ హాస్టల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న మలేరియా అధికారి రామారావు

క్రీస్తు మార్గం అనుసరణీయం : బిషప్ రాజారావు

గన్నవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికి క్రీస్తు మార్గం అనుసరణీయమని విజయవాడ బిషప్ తెలగతోటి రాజారావు అన్నారు. మండలంలోని కేసరపల్లి ఆర్సీఎం విచారణలో పునీత అంతోని మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. తొలుత సమిష్టి దివ్య బలిపూజను సమర్పించారు. ఈ సందర్భంగా బిషప్ రాజారావు ప్రసం గిస్తూ అందరు భక్తిశ్రద్ధలతో యేసు క్రీస్తును ఆరాధిం చాలని, పునీత అంతోని ఈ ప్రాంతంలో క్రీస్తు సందేశాన్ని వినిపించారని చెప్పారు. ఆయన అందరికి ఆదర్శనీయుడని చెప్పారు. విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ నూతలపాటి కిషోర్ ఆధ్వర్యంలో సాయంత్రం పునీత అంతోని వారి తేరు ఊరేగింపు గ్రామ పురవీధుల్లో జరిగింది. గన్నవరం విచారణ గురువులు పసల థామస్, విజయవాడ మేత్రాసన గురువులు మరియదళం సభ్యులు పాల్గొన్నారు.



మర్యాదపూర్వక కలయిక

సీఎంను కలిసిన పీఆర్‌కె ఫౌండేషన్ చైర్మన్ పారా రామకృష్ణ

గన్నవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు నాయుడిని సౌతా ఫ్రికా తెలుగుదేశం అధ్యక్షులు, పీఆర్‌కె ఫౌండేషన్ చైర్మన్ పారా రామకృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏడాది పాలన విజయవంతంగా పూర్తైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నియోకవర్గంలో సేవా కార్యక్రమాలు ప్రారం భించినట్లు వివరించగా మరింతగా చేపట్టాలని సీఎం చంద్రబాబు రామకృష్ణను అభినందించినట్లు తెలిపారు.



సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

ప్రసాదంపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 5.50 లక్షల చెక్కులను, ఎల్‌వోసీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రోగి కుటుంబ సభ్యులకు అందజేశారు. శుక్రవారం విజయ వాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తుందని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే నియోజక వర్గంలోని ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేశామని వెల్లడించారు. రోగుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



బాధితులకు సహాయనిధి ఎల్‌వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు





మధురానగర్ ఆర్వోబీపై ..

ఈనెల 3న పప్పులమిల్లు వద్ద ఆర్వోబీ ప్రతిపాదనను ఎంపీ కేశినేని చిన్నికి వివరిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

మధురానగర్, మధ్యకట్టవాసులు నగరంలో బీఆర్టీఎస్ రోడ్డుకు రావాలంటే పప్పులమిల్లు గేటు దాటుకుని రావాలి. రెండుట్రాక్‌లు..రోజూ 70కు పైగా రైళ్ల రాకపోకలు, ఉదయం నుంచి రాత్రి వరకు 72 సార్లు పడే గేటు కారణంగా చాలా ఇబ్బంది పడుతున్నారు. ఎప్పటి నుంచో ఇక్కడ వంతెన కోసం 29, 30, 31 డివిజన్ వాసులు ఎదురుచూస్తున్నారు. తాజాగా పప్పులమిల్లు రోడ్డులో ఆర్వోబీ నిర్మించాలని నిర్ణయించడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించినట్టయింది.



గవర్నమెంట్ ప్రెస్ నుంచి తిన్నగా ఉన్న మార్గం (ఎరుపు రంగు), నేతాజీ కాలనీ మీదుగా ఉన్న మార్గంలో మలుపులు (నీలి రంగు)

తొలగిన సందిగ్ధం

పప్పులమిల్లు వైపు నిర్మించాలని నిర్ణయం

మధురానగర్, బుడమేరు మధ్య కట్టవాసులకు తీరనున్న ఇబ్బందులు

- గేట్ల బంధనాల నుంచి ప్రజలకు విముక్తి

(ఆంధ్రజ్యోతి-మధురానగర్)

మధురానగర్ ఆర్వోబీ నిర్మాణం విషయంలో సందిగ్ధం తొలగింది. ముందుగా అనుకున్న నేతాజీ కాలనీ రోడ్డులో కాకుండా పప్పుల మిల్లు రోడ్డుమీదుగా ఆర్వోబీని నిర్మించనున్నారు. సెంట్రల్ నియోజవర్గం సింగ్‌నగర్, వాంబేకాలనీ నుంచి నగరంలోకి రావడానికి సింగ్‌నగర్ ఫ్లైవోవర్ ఒక్కటే దారి. టీడీపీ అధికారంలోకి రాగానే సెంట్రల్ నియోజకవర్గం బుడమేరు, ఏలూరు కాల్వ, రైవస్ కాల్వల మీద రైల్వే గేట్ల వద్ద వంతెనల ప్రతిపాదన వచ్చింది. అందులో భాగంగా మధురానగర్‌లో ఒక వంతెన అనుకున్నారు. మధురానగర్ రెండువైపులా రెండు రైల్వేగేట్లు ఉంటాయి. మధురానగర్ స్టేషన్ వద్ద గేటు స్థానంలో ఆర్‌యూబీ నిర్మించినా ట్రాఫిక్ నియంత్రణకు ఇది సరిపోవడం లేదు. దీంతో పప్పులమిల్లు గేటు మీద రద్దీపెరిగింది. ఈ రద్దీని తగ్గించడం కోసం ప్రత్యామ్నాయం ఆలోచించి చివరకు ఇక్కడ ఆర్వోబీ నిర్మించాలని నిర్ణయించారు.

నేతాజీ, పప్పులమిల్లు రోడ్ల పరిశీలన

ఆర్వోబీ నిర్మాణానికి నేతాజీ రోడ్డు, పప్పుల మిల్లు రోడ్లను అధికారులు పరిశీలించారు. గవర్నమెంట్ ప్రెస్ నుంచి వీవీ నరసరాజు రోడ్డు మీదుగా నేతాజీ కాలనీ రోడ్డులోకి ఎల్ టర్నింగ్ తీసుకుని బీఆర్టీఎస్ వంతెన పక్కన కిందకు దింపాలని అనుకున్నారు. ఈ నిర్ణయంతో నేతాజీకాలనీ వాసులు తమ ఇళ్లు కోల్పోతామని ఎమ్మెల్యే బొండా ఉమాను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో ఆయన మార్చి 12న వీఎంసీ అధికారులతో కలిసి నేతాజీ కాలనీకి వచ్చి సర్వే చేశారు. నేతాజీ కాలనీ రోడ్డు మీదుగా ఆర్వోబీ వస్తే కాలనీలో ప్రధాన రోడ్డుకు మధ్యలో మలుపు ఉండటం, ఇరువైపులా ఉన్న ఇళ్ల మొత్తాన్ని కదిలించాల్సి వస్తుందని గుర్తించారు. స్థానికుల ఆందోళన న్యాయమైనదని భావించి రైల్వే అధికారులను మళ్లీ సర్వే చేయమని కోరారు. వారు మే 14న వీఎంసీ, ఆర్ అండ్ బీ, ఇతర శాఖల అధికారులతో కలిసి వచ్చి నేతాజీ రోడ్డు, పప్పుల మిల్లు రోడ్డును పరిశీలించి నిర్ణయాన్ని స్థానికులకు వదిలేశారు.

పప్పులమిల్లు రోడ్డు ఖాయం చేశారిలా..

ఈనెల 3న ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే బొండా ఉమా గవర్నమెంట్ ప్రెస్ నుంచి వీవీ నరసరాజు రోడ్డుమీదుగా పప్పులమిల్లు వంతెన వరకు రోడ్డును పరిశీలించారు. మధ్యలో వీవీ నరసరాజు రోడ్డులో కలిసే నేతాజీ రోడ్డు కూడలి వద్ద ఆగి పరిశీలించారు. ఆర్వోబీకి ఇక్కడ మలుపు అనువుగా లేదని గుర్తించారు. గవర్నమెంట్ ప్రెస్ నుంచి తిన్నగా పప్పుల మిల్లు వంతెన వరకు ఉన్న రోడ్డు ఒకేమార్గంలో ఎక్కడా అడ్డంకి లేకుండా ఉండటంతో చివరకు పప్పుల మిల్లు రోడ్డు ఆర్వోబీ నిర్మాణానికి అనువుగా ఉంటుందని తేల్చారు.

పదేళ్ల కల!

సింగ్‌నగర్‌లో రెండో ఫ్లై ఓవర్ నిర్మించాలని దశాబ్దకాలంగా కోరుతున్న ప్రజలు

- ట్రాఫిక్ కష్టాలు తప్పించాలని డిమాండ్
- ఫ్లై ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణం కోసం ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి-అజిత్‌సింగ్‌నగర్): అజిత్‌సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌పై నానాటికీ ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతోంది. వివిధ ప్రాంతాల నుంచి నగరంలోకి ప్రవేశించేందుకు ఒక్కటే మార్గం కావడంతో ట్రాఫిక్ భారం పడుతోంది. మూడు దశాబ్దాల క్రితం అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో లక్ష లోపు జనాభా ఉండేవారు. అప్పట్లో వాహనాల సంఖ్య చాలా తక్కువ. అనేక మంది సైకిళ్లు, రిక్షాలు, ఆర్టీసీ బస్సుల్లోనే నగరంలోకి ప్రవేశించేవారు. అజిత్‌సింగ్‌నగర్ రైల్వే ట్రాక్‌ను దాటుకుని రావాల్సి వచ్చేది. రైల్వే ట్రాక్ వద్ద గేటు పడిన సమయంలో ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. సమస్యను అధిగమించేందుకు మూడు దశాబ్దాల క్రితం ఫ్లై ఓవర్ నిర్మించారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. జనాభా నాలుగు లక్షలకు చేరింది. ప్రతి ఇంట్లో ఒకటి, రెండు వాహనాలు ఉన్నాయి. పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాలే కాకుండా నున్న, నూజివీడు, ఆగిరిపల్లి, విస్సన్నపేట, తిరువూరు, ఖమ్మం, సత్తుపల్లి ప్రాంతాల నుంచి నగరంలోకి ప్రవేశించాలంటే ఈ ఫ్లై ఓవర్ ఒక్కటే మార్గం. ఒకటిన్నర కిలోమీటరు ఉండే ఈ ఫ్లైఓవర్ మీదుగా రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య రోజూ లక్ష పైమాటే. నేడు ఫ్లై ఓవర్ సామర్థ్యం సరిపోవడం లేదు. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఫ్లై ఓవర్ కింద ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేసినా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. రామవరప్పాడు ఫ్లై ఓవర్, పాల ఫ్యాక్టరీ ఫ్లై ఓవర్ ఉన్నా అజిత్‌సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌కు ప్రత్యామ్నాయం కాలేకపోతున్నాయి. అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌కు పక్కనే రెండవ ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ పదేళ్లుగా ఉంది. నేటికీ ఆ దిశగా అడుగులు పడలేదు.



ఎమ్మెల్యే, ఎంపీల కసరత్తు

అజిత్‌సింగ్‌నగర్‌లో రెండో ఫ్లై ఓవర్, ఫ్లై ఓవర్‌కు ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జిల నిర్మాణాల కోసం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని చిన్ని తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ఫ్లై ఓవర్, అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని కోరుతూ ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్యేలు రైల్వే అధికారులను కలిశారు. ఎంపీ చిన్ని రైల్వే శాఖా మంత్రికి సమస్యను విన్నవించనున్నారు. ఎమ్మెల్యే బొండా ఉమా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఇటీవల సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు.

ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ఇబ్బంది

ఉదయం, సాయంత్రం రాత్రి వేళల్లో ఫ్లై ఓవర్‌ను దాటాలంటే అరగంట సమయం తీసుకుంటుంది. ఫ్లై ఓవర్‌పై వాహనాలు మొరాయించినా, రోడ్డు ప్రమాదాలు జరిగినా ఇక ఫ్లై ఓవర్ దాటడం కష్టమే.

ముంపు సమయంలో నానా ఇబ్బందులు

ఇటీవల సంభవించిన వరద ముంపు సమయంలో ఫ్లై ఓవర్ మీదుగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ఫ్లై ఓవర్‌పై నిలిచిపోయాయి. ముంపు ప్రాంతాలకు సహాయక చర్యలు అందించడంలో అధికారులు ఇబ్బంది పడ్డారు. ఒకటిరెండు రోజులు హెలికాప్టర్లను వాడాల్సి వచ్చింది.



ఘంటసాలలో యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్వో చంద్రశేఖర్‌రావు

బౌద్ధారామంలో యోగాంధ్ర

- ఆసనాలు వేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జిల్లా అధికారులు, ప్రజలు

ఘంటసాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన బౌద్ధారామంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, ఈ ప్రాంతానికి గర్వకారణమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బౌద్ధ క్షేత్రమైన ఘంటసాలలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్, ఇతర అధికారులు ప్రజలతో కలిసి ఎమ్మెల్యే సామూహిక యోగాసనాలు వేశారు. రోజూ యోగా సాధన చేసి శారీరక, మానసిక ఆరోగ్యం పొందాలని ప్రజలకు పిలుపునిచ్చారు. యోగా శిక్షకుడు రెబ్బా పోతన శాస్త్రి ఆసనాలు యోగాసనాలు వేయించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, ఆర్డీవో కె.స్వాతి, డీఎస్పీ టి.విద్యశ్రీ, జిల్లా పర్యాటక శాఖ అధికారి జె.రామలక్ష్మణరావు, మెప్మా పీడీ సాయిబాబు, ఎంపీడీవో సుబ్బారావు, తహసీల్దార్ విజయప్రసాద్, హరినాథ్, ఆయూష్ శాఖ అధికారి డాక్టర్ జావెద్ ఖాన్, యోగా గురువులు మద్దాల చింతయ్య, నాగరాజు, శేష ప్రసన్న, కూటమి నేతలు, డ్వాక్రా మహిళలు, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు. యోగాసనాలు, బాలబాలికలు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

కృష్ణానదిలో జలాసనాల ప్రదర్శన ఏర్పాటు చేయండి

- అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశం

నాగాయలంక, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21కి ఒకటి రెండు రోజులు ముందుగా 100 మంది యోగాభ్యాసకులతో కృష్ణానదిలో తేలియాడే ఆసనాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని అధికారులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం శ్రీరామపాదక్షేత్రం పుష్కర ఘాట్‌లోని నదిలో తేలియాడుతూ అభ్యాసకులు చేస్తున్న పలు ఆసనాలను ఆయన ఆసక్తిగా వీక్షించారు. నీటిలో స్త్రీ, పురుషులు వేసిన పద్మాసనాలు, శవాసనాలు, వృక్షాసనాలను జిల్లా అధికారులతో కలిసి తిలకించారు. జిల్లా అధికారులు పి.సాయిబాబు, పోతురాజు, జావేద్ ఖాన్, అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, మత్స్యశాఖ ఏడీ ఆర్.ప్రతిభ, తహసీల్దార్ ఎం.హరినాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, ఉపసర్పంచ్ తలశిల నాని, ఆలూరి శ్రీనివాసరావుతోపాటు ఆయుష్ విభాగం వైద్యాధికారులు, మత్స్యకార నేతలు, యోగాంధ్ర జిల్లా ప్రధాన శిక్షకుడు పోతన శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బైక్

- ద్విచక్రవాహనం నడుపుతున్న ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

కృత్తివెన్ను, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కారును బైక్ ఢీకొన్న ఘటనలో బైక్ నడుపుతున్న ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం చెరుకుమిల్లి అడ్డరోడ్డు వద్ద 216 జాతీయ రహదారిపై జరిగింది. బంటుమిల్లి ఎస్సై గణేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మునిపెడ దళితవాడకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కాకర ఫణి(38) బంటుమిల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును చెరుకుమిల్లి అడ్డరోడ్డు వద్ద 216 జాతీయ రహదారిపై బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఫణి అక్కడికక్కడే మృతి చెం దాడు. బంటుమిల్లి పోలీసులు ఫణి మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కారు పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు కేపీ పాలేనికి చెందిన వ్యక్తిదని తెలిపారు.

యోగాతో ఆరోగ్యకర జీవితం

- ఆలిండియా రేడియో కార్యాలయ ప్రాంగణంలో 'యోగాంధ్ర'



ఆలిండియా రేడియో ఉద్యోగులతో కలిసి యోగాసనాలు వేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవితం యోగాతో సాధ్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నద్ధతలో భాగంగా నగరంలోని ఆలిండియా రేడియో కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ఆసనాలు వేశారు. పీఐబీ విజయవాడ అదనపు డైరెక్టర్ జనరల్ రాజిందర్ చౌదరి, ఆలిండియా రేడియో విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం.సోమేశ్వరరావు, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలో వివిధ విభాగాలకు చెందిన 150 మంది సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీ కేశినేని చిన్నిని సత్కరిస్తున్న ఎస్‌సీఆర్ఎంయూ జనరల్ సెక్రటరీ సీహెచ్ శంకరరావు, డివిజనల్ సెక్రటరీ ఎం.లీల

మర్యాదపూర్వకంగా..

- ఎంపీ కేశినేని చిన్నిని కలిసిన ఎస్‌సీఆర్ఎంయూ నాయకులు

రైల్వేస్టేషన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్(ఎస్‌సీఆర్ఎంయూ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్ శంకరరావు ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధిపై ఎంపీ వారితో చర్చించారు. రైల్వే స్టేషన్ ఆధునీకరణ, విస్తరణ, ప్రగతిపై సమాలోచన చేశారు. ప్రజల ప్రయోజనం కోసం రైల్వేసేవల్లో పురోగతికి తాను అందుబాటులో ఉండి పనిచేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. డివిజనల్ సెక్రటరీ ఎం.లీల, రాష్ట్ర జనరల్ సెక్రటరీ జీఎన్ శ్రీనివాసరావు, ఏడీఎస్ కె.పాములు, ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

మెట్రో..విజయవాడకు మరో మణిహారం

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్ర రవాణా ప్రణాళిక
- భాగస్వామ్య పక్షాల సూచనలతో దార్శనిక ప్రణాళికకు తుదిరూపు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'మెట్రో రైలు ప్రాజెక్టు నగరానికి గొప్ప ఆస్తి. మరో మణిహారం కానుంది. భాగస్వామ్యపక్షాల సలహాలు, సూచనలకు ప్రాధాన్యమిస్తూ విజయవాడ సమగ్ర రవాణా ప్రణాళిక(సీఎంపీ)కు తుదిరూపు ఇస్తాం.' అని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మెట్రో రైలు ప్రాజెక్టు సహా విజయవాడ సమగ్ర రవాణా ప్రణాళికపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ సమీక్షా సమావేశం నిర్వహించారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఏపీ ఎంఆర్‌సీఎల్ డిప్యూటీ సీజీఎం పి.రంగారావు హాజరయ్యారు. తొలుత సిస్ట్రా ఎంవీఏ కన్సల్టింగ్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి అంకుశ్ మల్హోత్రా సీఎంపీ ముసాయిదాను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వచ్చే 25-30 సంవత్సరాల నగర అవసరాలను పరిగణనలోకి తీసుకుని సీఎంపీని రూపొందిస్తున్నామని, విజయవాడ ప్రణాళికకు ట్రాఫిక్, కుటుంబ సర్వేను పూర్తిచేశామని తెలిపారు. భౌగోళిక స్థితిగతులు, ట్రా ఫిక్, రవాణా పరిస్థితులు, రవాణా మౌలిక వసతులు, భవిష్యత్తు జనాభా, ట్రావెల్ డిమాండ్ల ఆధారంగా సీఎంపీ ముసాయిదాకు రూపకల్పన చేశామన్నారు. కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ రూపకల్పన తుదిదశకు చేరుకుందన్నారు. ఫేజ్-1 కారిడార్ 1ఏ (గన్నవరం-పీఎన్‌బీఎస్), కారిడార్ 1బీ(పీఎన్‌బీఎస్-పెనమలూరు) నిబంధనలకు అనుగుణంగా భూ సేకరణ చేస్తామని తెలిపారు. కృష్ణాజిల్లా పరిధిలో మెట్రో ప్రాజెక్టుకు సహాయ సహకారాలు అందిస్తామని ఆ జిల్లా కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఎయిర్‌పోర్ట్ డైరక్టర్ ఎంఎల్‌కే రెడ్డి, డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కక్ష కట్టారు.. ఖతం చేశారు!

యువకుడిని చంపేసి ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నం ● ముగ్గురు నిందితుల అరెస్టు



నిందితులను మీడియాకు చూపుతున్న సీఐ చంద్రశేఖర్

ఇబ్రహీంపట్నం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తమ తండ్రిపై కర్రతో దాడి చేసి మతిస్థిమితం కోల్పోయేందుకు కారకుడైన యువకుడిపై కుమారులిద్దరూ కక్ష పెంచుకున్నారు. పథకం ప్రకారం చంపేసి..రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. దర్యాప్తులో పోలీసులకు దొరికిపోయి కటకటాలపాలయ్యారు. సినీఫక్కీలో జరిగిన ఓ మర్డర్‌ను పోలీసులు స్వల్ప వ్యవధిలోనే ఛేదించారు. ఇబ్రహీంపట్నం మండలం కాచవరం గ్రామానికి చెందిన నడకుదిటి ఏసుబాబు(25)ను హత్య చేసిన ముగ్గురు నిందితులు సైకం కుమారస్వామి(36), తిరుమలశెట్టి శంకర్(40), సైకం నవీన్‌బాబు(40)ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నిందితులను మీడియా ఎదుట సీఐ ఎ.చంద్రశేఖర్ హాజరుపరిచి, వివరాలు వెల్లడించారు. కాచవరం గ్రామానికి చెందిన సైకం ప్రభాకర్(55), నడకుదిటి ఏసుబాబు(25) ఆటో డ్రైవర్లు. మే 2న రాత్రి స్నేహితుడి ఆటోను ప్రభాకర్ రిపేరు చేస్తుండగా ఆటో శబ్దం రావడంతో ఏసుబాబు వెళ్లి గొడవపడ్డాడు. ప్రభాకర్ ముక్కుపై ఏసుబాబు బలంగా కొట్టి, కర్రతో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ప్రభాకర్‌కు మతిస్థిమితం పోయింది. తమ తండ్రి మతి స్థిమితం కోల్పోయేలా చేసిన ఏసుబాబు(25)ను ప్రభాకర్ కుమారులు నవీన్‌బాబు, కుమారస్వామి బెదిరించారు. కారుతో ఢీకొట్టించి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేలా సైకం నవీన్‌బాబు పథకం రచించాడు. దాన్ని అమలు చేసేందుకు అప్పటికే ఓ మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్న మామ తిరుమలశెట్టి శంకర్ సాయాన్ని కోరారు. కారును తీసుకుని ఈనెల 5 తేదీ రాత్రి కాచవరం వద్ద కాపుకాసి, తాగి వస్తున్న ఏసుబాబును ఎదురుగా వేగంగా వచ్చి ఢీ కొట్టి మర్డర్ చేశారు. అనంతరం కారుతో పరారయ్యారు. కారును మిర్యాలగూడలో దాచారు. ఏసుబాబు తల్లి అంజలి ఫిర్యాదుపై అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా కారు ఎవరిదో గుర్తించారు. కుమారస్వామి భార్య పేరుతో కారు రిజిస్టర్ అయి ఉండటంతో ఆకోణంలో దర్యాప్తు చేసి నిందితులను గుర్తించారు. ఇంతలో శుక్రవారం ముగ్గురు నిందితులు కాచవరం వెళ్లి వీఆర్వో అనూష వద్ద లొంగిపోయారు. ఆమె వారిని పోలీసులకు అప్పగించారు. ఏ1గా కుమారస్వామి, ఏ2గా శంకర్, ఏ3గా నవీన్‌బాబుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్సై విజయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో నీటమునిగిన వార్ఫురోడ్డు

గుడ్లవల్లేరులో భారీ వర్షం

- 116 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

గుడ్లవల్లేరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుడ్లవల్లేరులో శుక్రవారం మధ్యాహ్నం రికార్డుస్థాయిలో వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 గంటల సమయంలో 13.6 దుక్కులు, 116 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదైంది. సాయంత్రం వరకు నీటి ముంపు తగ్గకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వార్ఫురోడ్డులో ఎన్నడూ లేనివిధంగా మోకాళ్లలోతు నీరు చేరింది. దుకాణాల్లోకి నీరు చేరింది. సంతబజార్ ముంపునకు గురై ఇళ్లలోకి కూడా నీరు చేరింది. పండ్రాజు వారి వీధి, నిమ్మగడ్డవారి బజార్, కన్యకాపరమేశ్వరి ఆలయం రోడ్డు, ఇందిరా కాలనీ, రామాలయం వీధుల్లో మోకాళ్ల లోతు నీరు చేరింది.

దివి ఎడమ కరకట్ట అభివృద్ధికి రూ.రెండున్నర కోట్లు మంజూరు

అవనిగడ్డ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోడూరు మండలం ఉల్లిపాలెం నుంచి హంసలదీవి పుష్కరఘాట్ వరకు దివి ఎడమ కరకట్ట అభివృద్ధికి జలవనరుల శాఖ నుంచి రూ.2.50 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గడిచిన ఐదేళ్లలో సరైన నిర్వహణ, పర్యవేక్షణ లేక దివి ఎడమ కరకట్ట వర్షపు నీటితో పూర్తిగా గండ్లు పడిపోయి దెబ్బతిందని, వరదలు, విపత్తులు సంభవిస్తే ప్రజలు భయంతో కాలం గడిపే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికిప్పుడు కరకట్ట గండ్లు కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జలవనరుల శాఖ నుంచి రూ.2.50 కోట్లు మంజూరయ్యాయని, కృష్ణా, సముద్రపు కరకట్టలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి రోడ్డు నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపానని, శుక్రవారం సాయంత్రం ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

విజయవాడ ఏఎంసీ చైర్మన్, పాలకవర్గ ప్రమాణస్వీకారం రేపు



ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్న నర్రా వాసు (ఫైల్)

గొల్లపూడి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విజయవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం సాయంత్రం గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తామని చైర్మన్‌గా నియమితులైన నర్రా వాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, సత్యకుమార్‌యాదవ్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

టీడీపీలో అంకితభావంతో పనిచేస్తే ప్రతిఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందని, అందుకు తానే ఉదాహరణ అని నర్రా వాసు అన్నారు. తనకు చైర్మన్ పదవి ఇచ్చినందుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	108, 116, 127
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515





పెడన మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖరరెడ్డి

పెడన, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపల్ కమిషనర్‌గా ఎల్. చంద్రశేఖరరెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన కలెక్టర్ డీకే బాలాజీని చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.



నలుగురు పిల్లలకు తల్లికి వందనం జమ అయిన అబ్దుల్ కరీం, షబీనాబేగం



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభికం చేస్తున్న ప్రజలు



సూరపనేనివారి పాలెంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

తల్లుల హర్షాతిరేకాలు

• సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

మచిలీపట్నం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో చదువుకుంటున్న విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో తల్లికి వందన నగదు జమ కావడంతో కుటుంబ సభ్యులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మచిలీపట్నంలో అబ్దుల్ కరీం, షబీనాబేగంలకు నలుగురు పిల్లలకు రూ. 52వేలు జమ అయింది. మీర్ షహీరాబేగం పిల్లలకు నిధులు జమ అవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేసిన వాగ్దానం మేరకు తల్లికి వందనం కార్యక్రమం కింద నిధులు జమ చేయడం ముదావహమన్నారు. టీడీపీ నాయకుడు అబ్దుల్ అజీం, రిటైర్డు టీచర్ రియాజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. **పెడన :** టీడీపీ నాయకుడు మెట్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మఠం వీధిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశా రు. తల్లికి వందనం పథకం అమలు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. అనుముల పూర్ణచం ద్రరావు, కోరుమిల్లి వెంకటస్వామి, ఎలిగట్ల ప్రసాద్, కొసనం భార్గవ్ తదితర దేశం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. **పెడన రూరల్ :** మండలంలో తల్లికి వందనం నగదు తల్లుల ఖాతాలలో జమఅవుతున్నాయని ఎంపీడీవో అరుణకుమారి తెలిపారు. అనర్హుల జాబితాలో అర్హులైన వారు ఉన్న ఎడల సచివాలయాలలో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా గ్రీవెన్స్ రైజ్ చేయించుకుంటే వారి ఖాతాలో నగదు జమ అవుతుందని తెలిపారు. తల్లులు కూడా తమ బ్యాంక్ ఖాతా లావాదేవీలు ఆగిపోయి ఉంటే వెంటనే యాక్టివ్ చేయించుకుంటే నగదు జమ అవుతుందన్నారు. **ఘంటసాల :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి సూరపనేనివారిపాలెంలో శుక్రవారం పాలాభిషేకం చేశారు. సీఎం చంద్రబాబు తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయటం సంతోషంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. బొకినాల కృష్ణ, పోలిమెట్ల ఏసుబాబు, కొక్కిలిగడ్డ మదన్మోహన్, పెదపూడి సునీల్, గురు ప్రసాద్, మౌనిక, చిత్తూరి పద్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు.



బోడగుంటలో అశ్విని కుటుంబం ఆనందం

మోపిదేవి : మోపిదేవి, కె.కొత్తపాలెం, బోడగుంట, వెంకటాపురం, పెదప్రోలు గ్రామాల్లో ఎంత మంది పిల్లలు ఉన్నా వారందరికీ రూ.13 వేలు చొప్పున నగదు జమ అయ్యాయి. కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

మొక్కలు నాటిన స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు



చల్లపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు శుక్రవారం జాతీయరహదారి (బైపాస్) వెంబడి మొక్కలు నాటారు. 3498వ రోజు స్వచ్ఛ సేవలో తెల్లవారుజామున హైవే పక్కన 70 నీడనిచ్చే మొక్కలను, 30 పూలమొక్కలను నాటి నీరుపోశారు. స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్ - డాక్టర్ పద్మావతి దంపతుల సారథ్యంలో కార్యకర్తలు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. చల్లపల్లి పరిసర ప్రాంతాల్లో ఇప్పటికి 30వేలకు పైగా మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు.

తైక్వాండోలో చల్లపల్లి విద్యార్థినులకు పతకాలు



చల్లపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 9, 10, 11 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చల్లపల్లి సుబ్బు తైక్వాండో వారియర్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. అండర్ - 14 బాలికల విభాగంలో సిహెచ్.సాత్విక బంగారు పతకం, అండర్ - 11 బాలికల విభాగంలో ఎస్.మనస్వి, కె.కెజియా రజిత పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థినిలను, కోచ్‌లు కె.సుబ్బు, ఎస్.జాహ్నవిలను జిల్లా తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి పి.ఈశ్వర్ అభినందించారు.

నాలుగు పంచాయతీలకు నూతన కార్యదర్శులు

అవనిగడ్డ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీడీవో మరియదేవి తెలిపారు. అశ్వారావుపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శి జాహ్నవి రేమాలవారిపాలెంకు బదిలీ కాగా ఆమె స్థానంలో ఉదయలక్ష్మి కార్యదర్శిగా నియమితులయ్యారు. రామచంద్రాపురం పంచాయతీ కార్యదర్శి జ్యోతి వక్కపట్లవారిపాలెం బదిలీ కాగా, శివకుమార్ ఇక్కడకు వస్తున్నారు. మోదుమూడి పంచాయతీ కార్యదర్శి వై.రాజకుమారి భావదేవరపల్లి బదిలీ కాగా తోట శ్రీనివాసరావు వస్తున్నారు. వేకనూరు పంచాయతీ కార్యదర్శిగా బి.సత్యనారాయణ వచ్చారు.

పూరిల్లు దగ్ధం

అవనిగడ్డ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎడ్లంక గ్రామానికి చెందిన మునిపల్లి బాలస్వామి పూరిల్లు గురువారం రాత్రి 11 గంటల సమయంలో దగ్ధమై బీరువా, పలు వస్తువులు కాలిబూడిదయ్యాయి. మనుమరాలికి డెలివరీ కావటంతో ఇద్దరు వృద్ధులు ఆమె దగ్గరకు వెళ్లగా, ఇంటిలో ఎవరు లేకపోవటంతో ప్రమాదం తప్పిందని బాలస్వామి తెలిపారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ బాధితుడిని పరామర్శించారు. మునిపల్లి మోహనరావు, నలిగిల ఆనంద్, వాసు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానకోటయ్య హైస్కూల్ హెచ్‌ఎంగా ఇందిర

పెడన, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భట్ట జ్ఞానకోటయ్య జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా ఎల్. ఇందిర నియమితులయ్యారు. ఆమె జి.కొండూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాగాయలంక, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):గుడివాడలోని 220 కె.వి అవనిగడ్డలోని 132 కె.వి సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం మండలంలో ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మం డల విద్యుత్ ఏఈ జి.వెంకట రాజు తెలిపారు.

మండల పరిషత్ సిబ్బంది బదిలీ

పెడన రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కేశవరావుకు పదోన్నతి రావటంతో సీనియర్ అసిస్టెంట్‌గా నాగాయలంక బదిలీ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్‌గా ఎల్ ధనలక్ష్మి జడ్పీ నుంచి మండల పరిషత్‌కు బదిలీ కాగా శుక్రవారం జాయిన్ అయ్యారు. అటెండర్ కృష్ణమూర్తి జడ్పీకి బదిలీ అయినట్లు ఎంపీడీవో అరుణకుమారి తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వండి

మచిలీపట్నం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని మంత్రి కొల్లు రవీంద్రకు మచిలీపట్నం పాత్రికేయులు వినతిపత్రం సమర్పించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, కలెక్టర్‌కు ఎండార్స్‌మెంట్ రాసి పంపారు.

టీడీపీ నాయకుల పరామర్శ

మచిలీపట్నం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎయిమ్స్‌లో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చిన పోతిరెడ్డిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు మేకా గంగాధర్, పెదశింగు సామేరును శుక్రవారం టీడీపీ నాయకులు తలారి సోమశేఖర్, నాగుల్ మీరా, బొర్రా రాము, బత్తిన నాగరాజు, కె.రామాంజనేయులు పరామర్శించారు.



అవనిగడ్డ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి



బొళ్లపాడులో కిట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న పోతన స్వామి

పేదల విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

అవనిగడ్డ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పేదల విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డ ప్రభుత్వఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకం కింద పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెనుమూడి సాయిబాబు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నరసింహారావు, ఎంఈవో అన్నపరెడ్డి పిచ్చియ్య, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ దివి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు సునీత తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. **ఘంటసాల :** బొళ్లపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ విద్యా కిట్లు, సోలిస్ ఐ కేర్ హాస్పటల్ (హైదరాబాద్) వారిచే నోటు బుక్స్, బ్యాగ్, కాపీ రైటింగ్ బుక్స్ పంపిణీ శుక్రవారం జరిగింది. హాస్పటల్ ఛైర్మన్ ఎన్.రామాంజనేయులు ఆర్థిక సహకారంతో రూ.12 వేల విలువ గల పుస్తకాలు అందజేసినట్లు హెచ్‌ఎం పి.రాము తెలిపారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ కె.స్వరాజ్యలక్ష్మి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. **గూడూరు :** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్కూల్ కిట్లను శుక్రవారం డిసి ఛైర్మన్ పోతన స్వామి విద్యార్థులకు పంపిణీ చేశారు. గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పోతన స్వామి మాట్లాడుతూ, గతంలో ఎంత మంది పిల్లలుంటే అంత మం దికి తల్లికి వందనం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. విద్యా కమిటీ ఛైర్మన్ కృష్ణారావు, హెచ్‌ఎం గొరిపర్తి వెంకట విజయకుమారి, కూటమి నాయకులు పోతన రామోజీ, ఎస్‌ఏ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లిలో కూటమి విజయోత్సవ ర్యాలీ



బంటుమిల్లి (కృత్తివెన్ను), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం బంటుమిల్లిలో విజయో త్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మల్లేశ్వరం సువర్చల సమేత ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, కూటమి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి లక్ష్మీపురం సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిపథంలో నడుస్తుందన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకంను కూడ ప్రారంభిస్తామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ అంకినీడు ప్రసాద్ మృతికి చల్లపల్లి పంచాయతీ పాలకవర్గం సంతాపం



అంకినీడు ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్, ఈవో తదితరులు

చల్లపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : బందరు మాజీ ఎంపీ యార్లగడ్డ అంకినీడుప్రసాద్ మృతి తీరనిలోటని చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. చల్లపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అంకినీడు ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చల్లపల్లి రాజా వంశీయులు ప్రభువులుగానే కాక ప్రజాప్రతినిధులుగానూ ప్రజలకు ఎంతోసేవ చేశారని సర్పంచ్ తెలిపారు. ఎస్టేట్ దేవాలయాల ట్రస్టీగా, చల్లపల్లి రాజా విద్యాసంస్థ కరస్పాండెంట్‌గా అంకినీడుప్రసాద్ ఆలయాల అభివృద్ధికీ, పేదల విద్యాభివృద్ధికీ ఎనలేని సేవ చేశారని కొనియాడారు. ఈవో పివి.మాధవేంద్రరావు, వార్డుసభ్యులు అంబటి భువనేశ్వరరావు, మీర్ రిజ్వాన్, షేక్ సిలార్, అల్లంశెట్టి రంగనాయకమ్మ, రావులపల్లి విజయ మనోజ్‌కుమారి, కంతేటి నళిని, షేక్ జమీల, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సూర్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురం - నరసింహాపురం డ్రైనేజీ బాగు చేయండి



డ్రెయినేజీలో పేరుకుపోయిన గడ్డిని చూపుతున్న రైతులు

కోడూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాపురం నుంచి నరసింహాపురం వెళ్లే డ్రెయినేజీ బాగు చేయాలని రైతాంగం ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు. భారీ వర్షాలు పడితే వందలాది ఎకరాలు పంట నీట మునిగిపోతుందని రైతులు వాపోతున్నారు. డ్రెనేజీలో విపరీతంగా పెరిగిన గడ్డితో మురుగు పారడం లేదన్నారు. డ్రైనేజీని అనుకుని ఉన్న పొలాల్లోకి నీరు రావటంతో పంటలు తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. అధికారులు స్పందించి ఈ డ్రైనేజీలో ఉన్న చెరుకుల గడ్డి, ఈలగడ్డిని తొలగించి పొలాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. శుక్రవారం నాడు డ్రైనేజీలో నిండుకుని ఉన్న ఈలగడ్డి, చెరుకు గడ్డిని చూపిస్తూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అవార్డులు పొందిన విద్యార్థులకు సత్కారం



అవనిగడ్డ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే సామాజిక అంతరాలను అధిగమించి సమానత్వం సాధించటం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఎస్‌వి ఎల్.క్రాంతి కళాశాల ప్రాంగణంలో షైనింగ్ స్టార్స్ అవార్డులు పొందిన ఏ.పావని, ఉమేరాలను బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమమహేశ్వరరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబు, ప్రిన్సిపల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన యోగాంధ్ర పోటీలు

మచిలీపట్నం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పిన్నమనేని టీచర్స్ గిల్డ్ హోంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఆసనాలు, పాటలు, వ్యాసరచన తదితర పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని డిప్యూటీ కలెక్టర్ పోతన రాజు తెలిపారు. శుక్రవారం జరిగిన పోటీలను జి. కృష్ణ నిర్వహించారు. డీవైఈవో సత్యనారాయణ సింగ్, ఇంటర్ బోర్డు అధికారి సాల్మన్‌రాజు, ఆయూష్ వైద్యులు పర్యవేక్షించారు.

రక్తదానం చేసి రోగులను కాపాడండి

మచిలీపట్నం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేసి రోగులను కాపాడాలని జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత అన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం రక్తదానంపై అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ ఆశాలత, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్, లెప్రసీ అధికారి అంబటి వెంకట్రావు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ గీతావాణి, డాక్టర్ పావని, ఆకూరి శ్వేత తదితరులు పాల్గొన్నారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన మురళి, విజయకుమార్, విజయలక్ష్మిదేవిలను అభినందించారు.

ఊర్వేళమ్మ జాతర ప్రారంభం

నాగాయలంక, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భావదేవరపల్లి గ్రామ దేవత ఊర్వేళమ్మ జాతర మహోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. జాతర మూడు రోజులపాటు జరుగుతుంది. ఎమ్మెల్యే మం డలి బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, కుమారుడు వెంకట్రామ్ విశేష పూజలు చేశారు. సర్పంచి మండలి ఉదయభాస్కర్ దంపతులు, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, మండలి కాళేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొనగా, ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు పర్యవేక్షించారు.

మంగళాపురంలో జంగిల్ క్లియరెన్స్



చల్లపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మంగళాపురంలో పంచాయతీ ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. పెదకళ్లేపల్లి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు, కంప పెరిగిపోవటంతో ఎక్స్‌కవేటర్ సహాయంతో వాటిని తొలగింపజేశారు. సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు పనులను పర్యవేక్షించారు.

నైతిక విలువల పెంపునకు చైతన్య సదస్సులు

మచిలీపట్నం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నైతిక విలువల పెంపునకు చైతన్య సదస్సులు నిర్వహిస్తామని ప్రముఖ సీనియర్ ఆడిటర్ సి. శేషాచార్యులు (అప్పాజీ) అన్నారు. దివ్యజ్ఞాన సమాజం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, కార్యదర్శి కొత్తగుండు రమేష్, కోశాధికారి ఎం.సత్యనారాయణ, ఎస్. వెంకటేశ్వరరావు, కారుమూరి రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఉడత్తు శ్రీనివాసరావు, రామిశెట్టి దుర్గాప్రసాద్, పి.వి.ఫణికుమార్, చలపతిరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	108, 116, 127
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

కొండాలమ్మకు లక్ష మల్లెలతో అర్చన

గుడ్లవల్లేరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి లక్షమల్లెలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆర్.శివ సంతోష్ శర్మ ఆధ్వర్యంలో 21 మంది రుత్వికుల వేదమంత్రాల నడుమ అమ్మవారికి లక్షమల్లెలతో అర్చన నిర్వహించారు. తొలుత అమ్మవారికి 12 రకాల ఫలరసాలచే అభిషేకాలు నిర్వహించారు. అర్చనకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు దంపతులచే పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పూజాది కార్యక్రమాలకు సేవచేసేందుకు ఉయ్యూరు ప్రాంతం నుంచి భక్త సమాజం వారు మల్లెలను సిద్ధం చేశారు. లక్షమల్లెలతో అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించుకొన్నారు.





వరి నారుమడులను శుభ్రంచేస్తున్న కౌలురైతులు

ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సన్నద్ధం

పామర్రు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నదాతలు ఖరీఫ్‌సాగుకు వ్యవసాయ పనులను ప్రారంభించారు. తొలకరి పలకరిచడంతో పంట కాల్వలల్లో నిల్వ ఉన్న కొద్దిపాటి సాగునీటిని ఇంజన్ల ద్వారా ఆకుమళ్లకు అవసరమైన నీటిని వినియోగించుకుంటు రైతులు పంటల సాగుకు నిమగ్నమయ్యారు. వరిని సాగు చేసేందుకు ఇప్పటికే వేసవి దుక్కులు దున్నారు. వరి విత్తనాలను సేకరించి నారుమడులను రైతులు సిద్ధం చేస్తున్నారు. మరికొంతమంది రైతులు పంటకాల్వలతోపాటు బోర్ల నీటి ద్వారా నారుమడులను పోసే పనుల్లో బిజీబిజీగా కనిపించారు. మండల వ్యాప్తంగా ఉన్న 9766 హెక్టార్లలోని భూముల్లో అధిక శాతం వరి సాగు పైనే రైతులు దృష్టి సారించారు.

తల్లికి వందనం నగదు జమ

● మొవ్వ మండలంలో 4243 మంది అర్హులు ● సచివాలయాల్లో అర్హుల జాబితా ప్రదర్శన

(ఆంధ్రజ్యోతి - కూచిపూడి) : తల్లికి వందనం పేరిట అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ కావటంపై విద్యార్థుల తల్లులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొవ్వలో 4243 మంది అర్హులుగా అధికారులు గుర్తించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం అమలేయటం పట్ల ప్రభుత్వానికి వందనం చేస్తున్నట్లు విద్యార్థుల తల్లులు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి తల్లుల ఖాతాల్లో నగదు జమ అవుతున్నట్టు వారి మొబైల్ ఫోన్లకు సమాచారం రావటం ప్రారంభమైంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు మెస్సేజ్ ఎప్పుడు వస్తుందా? అని ఆత్రంగా ఎదురుచూడటం ప్రారంభించారు. ఆ సమయం వచ్చినట్టు తల్లికి వందనం పథకం కింద మీ ఖాతాల్లో ఇంత మొత్తం జమ అయినట్లు సమాచారం రావటం, సాయంత్రానికి ఎక్కువ మంది ఖాతాల్లో జమ అయినట్లు వచ్చింది. మొవ్వ లో 11 గ్రామ సచివాలయాల్లో అర్హుల జాబితాను, అనర్హుల జాబితాను సచివాలయాల్లో అధికారులు ప్రకటించారు.



అర్హుల జాబితా విడుదల చేస్తున్న అధికారులు

ఇద్దరి పిల్లలకు నగదు జమ అయింది

నా ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పేరిట ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున రూ.26 వేలు జమ అయింది. పెరిగిన ఫీజుల నేపథ్యంలో ఇద్దరు పిల్లల ఫీజులు చెల్లించటానికి మాకు కొంతమేర ఆసరాగా ఉంటుంది. కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు



అనన్య, కూచిపూడి

చదువుకు ఉపయోగకరంగా ఉంటుంది

నా కుమార్తె పర్ణిక రెండవ తరగతి చదువుతుంది. తల్లికి వందనం పథకం కింద రూ.13 వేల నగదు జమ అయింది. శుక్రవారం మధ్యాహ్నం నగదు జమ అయినట్లు మెస్సేజ్ వచ్చింది. ఈ మొత్తం పిల్లల చదువుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.



శరణ్య, చినముత్తేవి

పలువురు బాధ్యతలు స్వీకరణ

గుడివాడ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ మండల వ్యవసాయాధికారిగా సాయి సింధు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా చల్లపల్లి మండల వ్యవసాయాధికారిగా పని చేస్తున్న సాయి సింధు ఇక్కడ ఖాళీ ఏర్పడటంతో గుడివాడ టెక్నికల్ ఏవోగా బాధ్యతలు స్వీకరించారు. ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి ఆధ్వర్యంలో చార్జ్ తీసుకున్నారు. గుడివాడ మార్కెట్ యార్డు భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయాధికారిగా మాధురి కిరణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కంకిపాడు మండల వ్యవసాయాధికారిగా ఉండి ఖాళీ ఏర్పడటంతో కంకిపాడు నుంచి గుడివాడ మార్కెట్ యార్డు ఏవోగా బాధ్యతలు స్వీకరించారు.

మద్యం మత్తులో యువతి హల్‌చల్

గుడ్లవల్లేరు :మద్యం మత్తులో వరిపొలాల సమీపంలో హల్‌చల్ చేసిన యువతిని పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లితండ్రులకు అప్పగించిన వయనమిది. గుడివాడ బేతోలుకు చెందిన యువతి బంధువుల ఇంటిలో ఉంటూ గుడ్లవల్లేరులో చదువు కుంటుంది.ఈ నేపథ్యంలో తన లవ్ బ్రేకప్ అయిందని గురువారం సాయంత్రం తన స్నేహితుడితో కలిసి గుడ్లవల్లేరు సమీపంలోని డొంకరోడ్డుపై ఇద్దరూ కలసి మద్యం సేవించారు. ఆ యువతికి మద్యం మత్తు ఎక్కువై తూలిపోతూ, చిందులు వేస్తూ హల్‌చల్ చేసింది. సమీప చేలకు వెళ్లే గ్రామస్థుడు ఒకరు ఈ అమ్మయిపై ఆ యువకులు ఏదో అఘాయిత్యం చేయబోతున్నారన్న సందేహంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో మహిళా హోమ్‌గార్డు, కానిస్టేబుల్ వచ్చి ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి పెద్దలకు అప్పగించారు.

ప్రణాళికాబద్ధంగా సమస్యలను పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని రైతు సమస్యలను ప్రణాళికబద్ధంగా పరిష్కారిస్తున్నానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక చంద్రయ్య డ్రెయిన్ పరివాహక పంట పొలాల్లో పర్యటించి పెద ఎరుకపాడు, బేతవోలు రైతులతో మాట్లాడారు. చంద్రయ్య డ్రెయిన్ కట్ట పటిష్టంగా లేకపోవడంతో ప్రతిసారి గండ్లు పడి పంటలు మునుగుతున్నాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్ట పటిష్టతకు రూ.10లక్షలతో అంచనాలు రూపొందించామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. రైతులను సమస్యలను ప్రత్యక్షంగా చూశానని, కూటమి ప్రభుత్వంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఆర్థిక సాయం అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సుబ్బారావు, కూటమి నాయకులు మహేశ్వరరావు, రాజు, శేషు, ఆంజనేయులు, ఉమాశంకర్, పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

విద్యుత్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

● సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎన్‌వి.ఇమ్మానియేల్

పామర్రు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ అదాలత్‌లను గ్రామీణ ప్రాంతాల్లోని విద్యుత్ వినియోదారులు సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్‌ఎఫ్ (కన్జూమర్ గ్రీవెన్స్ రెడిషియల్ ఫోరం) చైర్మన్ ఎన్‌వి.ఇమ్మానియేల్ అన్నారు. శుక్రవారం పామర్రు డివిజన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాలశీతల కేంద్ర పంక్షన్ హాల్లో విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ అదాలత్‌పట్ల వినియోదారులను చైతన్య వంతుల్ని చేసే బాధ్యత సంబంధిత విద్యుత్‌శాఖ క్షేత్రస్థాయి అధికార సిబ్బంది తీసుకోవాలన్నారు. పేదలైన విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు తప్పవన్నారు.



వినియోదారుని నుంచి లిఖితపూర్వక ఫిర్యాదు అందుకుంటున్న ఇమ్మానియేల్

ఇసుక తవ్వకాలు నిలిపివేత

తోట్లవల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఇచ్చిన ఆదేశాలతో రొయ్యూరు, నార్తువల్లూరు క్వారీల్లో ఇసుక తవ్వకాలు నిలిపివేసినట్టు తహసీల్దార్ ఎం కుసుమకుమారి శుక్రవారం తెలిపారు. రుతుపవనాల రాకతో భూగర్భ జలాలు పెరిగేందుకు అక్టోబర్ 15 వరకు అన్నిచోట్ల ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించటంతో కలెక్టర్ తమకు ఆదేశాలిచ్చారని, దాంతో ఇసుక తవ్వకాలను నిలిపివేశామని తహసీల్దార్ తెలిపారు. మైనింగ్ అధికారులు క్వారీలను సందర్శించి ఎక్సకవేటర్‌లతో క్వారీల్లోకి లారీలు ప్రవేశించకుండా గాళ్ళు తవ్వించారన్నారు. అలాగే కరకట్ట వెంబడి అన్ని గ్రామాల్లో కార్మికులు ఇసుక తవ్వకాలు జరపకుండా ఊడాలని విఆర్వోలను ఆదేశించినట్టు చెప్పారు. ప్రజలు కూడా ఇసుక తవ్వకాలు చేయకూడదని గ్రామాల్లో మైక్ ప్రచారం కూడా నిర్వహించామన్నారు.



క్వారీలోకి లారీలు వెళ్లకుండా తవ్విన గాడి

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్

గుడివాడ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యల పరిష్కారానికి కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ అంశాలపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ పరిధిలో తల్లికి వందనం నగదు తల్లుల అకౌంట్లలో పడుతుందని తెలిపారు. ఎవరైనా ఇబ్బందులు ఉంటే ప్రధానోపాధ్యాయులతో మాట్లాడాలని, సచివాలయ ఉద్యోగులు కూడా వారికి సహకారం అందించాలన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యదర్శులు ప్రభుత్వ పథకాలు అమలేయటానికి ఎల్లవేళలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్



వివరాలు తెలియజేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

పెదపారుపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ మీటర్ల లోడు వాడకంపై ఆ శాఖ అధికారులు మండలంలో 10 గ్రామపంచాయతీల్లో 41 టీములుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్టు మండల విద్యుత్ శాఖ గుడివాడ డివిజన్ ఈఈ జిబి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2887 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేయగా, వాటిలో 313 గృహాల్లో అనుమతి ఉన్న లోడు కంటే అధికంగా వాడుతున్నట్టు గుర్తించామన్నారు. విద్యుత్ లోడు క్రమబద్ధీకరించుకోవటానికి ఇంటి యజమానులకు నోటీసులు అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ సీహెచ్.వాసు, విజిలెన్స్ ఈఈ కిరణ్‌బాబు, మండల ఏఈ ఎస్‌ఏ.ఎస్. వరకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకేంద్రం అధ్యక్షుడిగా రత్నప్రసాద్

పెదపారుపూడి : పెదపారుపూడి పాల కేంద్రం అధ్యక్షుడిగా పునుకొల్లు రత్నప్రసాద్ (నాని) 4వ విడత ఏకగ్రీవంగా పాడి పశువుల రైతులు తనను ఎన్నుకున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డైరీ) ట్రస్ట్ డైరెక్టర్‌గా సైతం పని చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషకులకు పాలకు తగిన గిట్టుబాటు ధర యాజమాన్యం అందించే విధంగా తన శక్తికి మించి కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. 4వ సారి తన మీద నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.



విద్యతోనే ఉన్నతస్థితి సాధ్యం

పెదపారుపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి) అన్నారు. శుక్రవారం వెంట్రప్రగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పస్ట్ క్లాస్‌లో వచ్చిన వారికి టీడీపీ నుంచి రూ.10 వేలు అందజేస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కె.హరి కిశోర్, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య, మాజీ సర్పంచ్ గొరిపర్తి రవికుమార్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : రెడ్డిపాలెం గ్రామానికి చెందిన యువకులు పామర్తి వీరరాఘవులు, మోదుగుమూడి అంకాలరావులు యూ క్యూబ్ సంస్థను హైదరాబాద్‌లో నిర్వహిస్తూ మంచి స్థాయికి వెళ్లారు. సొంత ప్రాంతానికి సేవచేయాలన్న లక్ష్యంతో యూ క్యూబ్ ఫౌండేషన్‌ను స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని రెడ్డిపాలెం, వడ్లమన్నాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ ఏడాది రూ. 50 వేల విలువ చేసే పుస్తకాలను పంపిణీ చేయనున్నామని వారు తెలిపారు.



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న రమేష్ చౌదరి

రైతులకు ఈకేవైసీ నమోదు తప్పనిసరి



ఈకేవైసీ నమోదు చేయించుకుంటున్న రైతులు

తోట్లవల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20వ తేదీలోపు అన్నదాత సుఖీభవ పథకంలో భూమి గల రైతులు తమపేర్లు నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి జి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. పట్టాదారుపాసుపుస్తకం గల రైతులు బ్యాంకు ఖాతా నెంబరుకు లింక్ అయిన ఆధార్‌కార్డు తీసుకు వచ్చి ఆర్‌ఎస్‌కేల్లో తంబు(వేలిముద్ర) వేస్తేనే పథకం వర్తిస్తుందని చెప్పారు. ఎస్సీ, బీసీ సొసైటీ సభ్యులకు వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన సీ క్లాస్(లంకభూమి) లీజు పట్టాలతో ఆయా రైతులు అన్నదాత సుఖీభవ పథకంలో చేరుతున్నారు. అయితే సొసైటీలో సభ్యుడిగా ఉన్నవ్యక్తి మరణించటంతో కుటుంబ సభ్యుల పేరు నమోదు చేయటం లేదని పలువురు తెలిపారు. ఆ కుటుంబంలో సభ్యునికి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గుడివాడ రూరల్: అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు రైతు సేవా కేంద్రంలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ఆయా సచివాలయాల పరిధిలోని వ్యవసాయ సహాయకుల దగ్గరకు వెళ్లి ఈకేవైసీ నమోదు చేయించుకుంటేనే పథకాలు వర్తిస్తాయని ఆమె తెలిపారు. వ్యవసాయ సహాయకులు కూడా వచ్చిన రైతులకు అవగాహన కల్పించి ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలన్నారు.

వివిధ శాఖల అధికారుల బదిలీలు

కూచిపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండల ఎంపీడీవోగా పని చేస్తున్న జె.వి మాదేవిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పామర్రు నియోజకవర్గంలోని పెదపారుపూడి మండలానికి ఈమె బదిలీ అయ్యారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం అక్టోబరు 4న మొవ్వ ఎంపీడీవోగా ఈమె బాధ్యతలు చేపట్టారు.

మొవ్వ మండల వ్యవసాయశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కంచర్ల శివప్రసాద్ గన్నవరం మండలం వ్యవసాయ శాఖాధికారిగా బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా శివ ప్రసాద్ 2017 జూన్ నెలలో మొవ్వ ఏవోగా బాధ్యతలు చేపట్టారు. ఈయన స్థానంలో జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్నసురేష్‌నాయక్ మొవ్వకు బదిలీ అయ్యారు.

ఎస్సైకు క్యాష్ రివార్డు

నందివాడ : స్థానిక నందివాడ మండల పోలీసు స్టేషన్ ఎస్సై కె.శ్రీనివాస్‌ను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు క్యాష్ రివార్డుతో సత్కరించారు. కేసుల విషయంలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఈ క్యాష్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గుడివాడ డీఎస్పీ వినీల్ ధీరజ్, రూరల్ సీఐ సోమేశ్వరరావు ఎస్ఐకి అభినందనలు తెలియజేశారు.

మోటూరు రైల్వేగేటు మూసివేత 16 నుంచి

గుడివాడ : గుడివాడ మండల పరిధిలోని మోటూరు రైల్వే గేటును ఈ నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మూసివేస్తున్నట్టు రైల్వే పి.డబ్ల్యూయ రెహ్మాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15రోజుల పాటు రైల్వే గేటు, ఇతర మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నామని, ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మండలంలో మాజీ ఎమ్మెల్యే పర్యటన

పెదపారుపూడి: పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ సుడిగాలి పర్యటన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మోపర్రు గ్రామ మాజీ సర్పంచ్ జూపల్లి రాజేశ్వరి, జూపల్లి వెంకటరావుల కుమార్తె వివాహ విషయమై నూతన దంపతులను ఆశీర్వదించారు. వెంట్రప్రగడ, అప్పికట్ల, పెదపారుపూడి తదితర గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడిన కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎంపీపీ గోగం సురేష్, నాయకులు సోమేశ్వరరావు, ఆల రమేష్, వెంకటరావు, చంద్రశేఖర్, బోయిన సాంబశివరావు, మద్దాల అశోక్, జూపల్లి శేఖర్, నామ వెంకటేశ్వరరావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ తిప్పలు

● చెరువును తలపిస్తున్న బస్టాండు
● తీరని ప్రయాణికుల ఇక్కట్లు
● పెట్రోలు బంకు తొలగింపునకు అదేశాలు

ఆంధ్రజ్యోతి - గుడివాడ : వర్షం కురిస్తే చాలు గుడివాడ బస్టాండ్ చిన్నపాటి చెరువును తలపిస్తుంది. మోకాల్లోతు మురుగు నీటిలో ప్రయాణీకులు రాకపోకల సమయాల్లో పడరాని పాట్లు పడాల్సి వచ్చింది. దశాబ్ధాలుగా ఉన్న బస్టాండ్ మునక సమస్యను పరిష్కరించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారు. గ్యారేజ్ లోపల అంతర్గత డ్రెయినేజ్ నిర్మించి బయట ఉన్న పంపింగ్ పాయింట్‌కు అనుసంధానం చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో గ్యారేజ్ నుంచి వచ్చేనీటిని ఎప్పటికప్పుడు బస్టాండ్ బయట ఉన్న ముగురు కాలువల్లోకి పంపింగ్ చేస్తున్నారు. వర్షపు నీటితో పాటు గ్యారేజ్ నీరు కలవడంతో ఎక్కువై కొద్దిపాటి వర్షానికే బస్టాండ్ నీటమునుగుతుంది. దీంతో ప్రయాణీకులు బస్టాండ్‌లోకి వెళలలేక అవుట్‌గేట్ బయట బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం

బస్టాండ్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ నెలాకరు లోగా పెట్రోలు బంకును తరలిస్తాం.

రాజేష్ , డిపో మేనేజరు

అడ్డుగా ఉన్న పెట్రోల్ బంకు....

ఇప్పటికే గ్యారేజ్ లోపల పెట్రోలు బంకు నిర్మాణం చేశారు. కేవలం బంకు తరలించేందుకే అధికారులకు రెండేళ్లు పట్టింది. జూన్ నెలాఖరులోపు బంకును తరలించి స్థలాన్ని అప్పగిస్తామని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.



నీటమునిగిన గుడివాడ బస్టాండ్